ఆదివారం

ప్రజాశక్తి

నవంబర్ 30, 2003



శ్రద్ధాంజలి

మానవాళిని కబళిస్తున్న ఎయిడ్స్ భూతం

హ్యాపీ బర్త్‌డే

(30-11-2003నుండి 6-12-2003వరకు)

ఆర్. ప్రసన్నలక్ష్మి
1సం॥, 30.11.2002
మంజుల-రవికుమార్
తాడూర్- మహబూబ్‌నగర్

మాధురి
4సం॥, 30.11.1999
కమల- అప్పన్న
పెద్దాపురం-తూ॥గో॥

సంజయ్‌చౌదరి
2సం॥, 1.12.2001
కవిత- సుధాకర్
ఖమ్మం

సారిక
డిసెంబర్-2
రమ- శ్రీనివాస్
కోదాడ-నల్లగొండ

ఐలా
1సం॥, 4.12.2002
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

కౌశిక&
1సం॥, 5.12.2002
అమృత-బిక్షపతి
పర్వేద-రంగారెడ్డి

సిహెచ్. హృషికేష్
2సం॥,5.12.2001
మంజుల-వేణు
ఖమ్మం

తస్లీమ్
4సం॥, 6.12.1999
సుల్తానా-రషీం
మహంతిపురం-విజయవాడ

వి. శ్రావణి
3సం॥, 30.11.2000
లక్ష్మీదేవి-వెంకటేశ్వర్లు
జవహర్‌నగర్-హైదరాబాద్

పి. జాహ్నవి
1సం॥, నవంబర్-2002
శివకుమారి-సురేష్
ముత్తుకూరు

జాహ్నవిదేవి
నవంబర్
విజయశ్రీ- చందు
ఏలూరు-ప॥గో॥

సంపత్‌మహిల్
2సం॥, నవంబర్-2001
శ్రీదేవి-నరసింహ
యలమంచిలి-విశాఖ

సాయిస్రవంత్
నవంబర్
రత్నశ్రీదేవి-రమేష్
అప్పన్నపల్లి-తూ॥గో॥

పండు
నవంబర్
ఎమ్మెస్ రెడ్డి
ఏలూరు-ప॥గో

ఎస్. సింధు
4సం॥, నవంబర్-1999
స్వరూప-స్వామి
మంచాల-రంగారెడ్డి

సుచరిత- సాయికృష్ణ
5సం॥, నవంబర్-1998- 3సం॥, నవంబర్-2000
మునికుమారి- చంద్రకుమారి
కరకంబాడి-చిత్తూరు

బి. ఉష
4సం॥, నవంబర్-1999
క్యోతి-వీరాంజనేయులు
ఇప్పటూరు-మహబూబ్‌నగర్

సౌమ్య
నవంబర్
కృష్ణకుమారి-సీతారామయ్య
విశాఖపట్నం



రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



అంధుల కచేరీ అద్భుతం

16వ తేదీ ఆదివారం అనుబంధంలో రాసిన రియల్‌స్టోరీ బాగుంది. పుట్టుకతోనే అంధులై వుండి తమకే కాక తమలాంటి అంధులను అక్కున చేర్చుకుని ఉపాధి కల్పించిన తీరు బాగుంది. జీవనశైలిలో 'ఆ రోజు ఎప్పుడొస్తుంది' బాగా నచ్చింది. అధికారంలో వున్న ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో వ్యవహరిస్తే లంచగొండితనం, అన్యాయాలు, అక్రమాలకు తావే వుండదు. ఎస్.వి.యూనివర్సిటీపై రాసిన కవర్ స్టోరీ బాగుంది.

- టి.కల్పన, సౌత్‌మోపూర్, నెల్లూరు జిల్లా

రచయితలకు మనవి

ఆదివారం అనుబంధంలో ప్రచురణ కొరకు కథలు పంపే రచయితలకు సూచన. కథలు పేజీకి 20 లైన్లకు మించకుండా ఐదు అరఠావుల్లో రాయాలి. పేజీకి ఒకవైపునే రాయాలి. ప్రచురణార్హం కాని కథలు తిప్పి పంపగోరువారు తగిన స్టాంపులు అంటించిన కవరు జతపరచాలి. కథలు <u>పంపవలసిన చిరునామా:</u>

సంపాదకులు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

అనుబంధం బాగుంటోంది

ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో చాలా మార్పులు చేశారు. కొత్త శీర్షికలతో ఎంతో ఆసక్తికరంగా వస్తోంది. 16వ తేదీ పుస్తకంలో ప్రచురించిన శ్రీ వేంకటేశ్వరా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సంబరం వ్యాసం బాగుంది. ఆ యూనివర్శిటీ గురించి చాలా సమాచారం ఇచ్చారు. అంధుల కచేరీ కూడా చాలా ఉత్తేజకరంగా సాగింది.

- వి. రామకృష్ణ, విశాఖపట్టణం

రేషన్‌కార్డులు, కక్కసుదొడ్లు

16వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన రుక్మిణీ గారి రేషన్‌కార్డులు, కక్కసుదొడ్లు కచేరీ చాలా బాగుంది. సామాన్య ప్రజలకు ఉపయోగపడని రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఎండగడుతూ సరదాగా రాసిన కచేరీ ఆసక్తికరంగా ఉంది. లక్ష్మిగారి ఇంతి సంగతులు కూడా చాలా బాగుంటోంది.

- ఎస్. లక్ష్మి, సూర్యాపేట, నల్గొండ జిల్లా



కరదీపిక

స్వర్ణోత్సవ సంబరాలను జరుపుకుంటున్న శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ గురించి ప్రచురించిన ఈవారం కవర్ స్టోరీ ఆసక్తిదాయకంగాను, విజ్ఞానదాయకంగాను ఉంది. యూనివర్సిటీకి సంబంధించిన ఎంతో విలువైన సమాచారాన్ని ఈ వ్యాసం అందించింది. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా అన్ని హంగులతో సకల సౌకర్యాలతో అలరారుతున్న ఎస్.వి.యూనివర్సిటీ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కరదీపిక లాంటిది. పాలనా పరమైన సమస్యలను అధిగమించి అభివృద్ధి పథంలోకి దూసుకుపోతున్న శ్రీవేంకటేశ్వరా యూనివర్సిటీ మరిన్ని మైలురాళ్ళను సొంతం చేసుకోవాలి.

గమనిక

ఆదివారం అనుబంధంలో రుచి శీర్షిక మీరు చూసే ఉంటారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తిలో ప్రచురిస్తాము. వంటకం ఫోటోతో పాటు రాసిన వారి ఫోటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా: రుచి, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, అశోక్‌నగర్, హైదరాబాద్ 20

మనలో మాట

ఏం జరుగుతోంది ?

ఒకప్పుడు -

కాశీకి వెళ్ళినవాడు కాటికి వెళ్ళినట్టె అనేవారు!

నిజమే మరి -

ఆ రోజుల్లో ప్రయాణ సౌకర్యాలు బొత్తిగా వుండేవి కావు! సొంతకాళ్ళనే తప్పనిసరిగా నమ్ముకోవాలి!

మూటాముల్లె భుజాన వేసుకుని బయలుదేరేవారు!

మార్గంలో-

కాకులు దూరని కారడవులూ...

చీమలు దూరని చిట్టడవులూ...

వాగులూ, నదులూ, పెద్ద పెద్ద కొండలూ...

గాలివానలూ, నిప్పులు చెరిగే ఎండలూ...

– ఇలా అనేకానేకమైన అవరోధాలు తమ ప్రయాణానికి ఆటంకం కలిగించేవి. పులులూ, సింహాలూ గర్జించేవి! పాములూ, కొండ శిలవలూ బుసలు కొట్టేవి!

అడుగు పెట్టేవో నిలువునా ముంచేస్తామని వాగులూ నదులూ బెదిరించేవి! కాలు జారిందో కబళించేస్తామని మహా పర్వతాలు భయపెట్టేవి!

వీటికి తోడు అస్వస్థత! మందూ మాకూ దొరకని పరిస్థితి!

కాశీకి వెళ్ళితీరాలని పంతం ఒక పక్కా – ఈతి బాధలు అనేకం ఇంకో పక్క ఆ మనిషిని అతలాకుతలం చేసేవి!

అదృష్టం బావుంటే -

విశ్వేశ్వరుడ్ని దర్శనం చేసుకుని తరించేవాడు!

దురదృష్టం తగులుకుంటే -

దిక్కులేని చావుతో సరిపెట్టుకునేవాడు!

కోర్టు గొడవ కూడా ఇంచుమించు ఆనాటి కాశీయాత్ర లాటిదే! తగులుకుంటే విడిచిపెట్టదు!

తాతల కాలంలో వేసిన కేసు - మనవళ్ళ కాలంలోగాని తెమలదు! అదుగో ఇదుగో అంటు కాలం పరుగెడుతుందేగాని - కేసు మాత్రం పరిష్కారం కానేకాదు!

ఈ కారణంగానే -

నేరం చేసిన మనిషి సిగ్గుతో తలవంచుకోకుండా -

కోర్టులో చూసుకుందామని ధీమాగా సవాలు చేస్తాడు ! బాధితుడు కూడా - గతిలేని పరిస్థితిలో కోర్టునే ఆశ్రయిస్తాడు!

అటోఇటో తేల్చి చెప్పేందుకు - కోర్టులు - చెట్టుకింద సమావేశాలు కాదు గదా! ప్రతి అంశాన్నీ అనేక కోణాల నుంచి క్షుణ్ణంగా పరిశీలించాలి! తొందరపడి అది తప్పు ఇది ఒప్పు అని చెప్పకూడదు!

నేరస్థుడు ఎంత లావు నేరం చేసినా -

తగిన సాక్ష్యం లేకపోతే ఆ నేరం గాలికొట్టుకుపోతుంది!

అంచేత - కోర్టువారికి - సాక్షి మహాశయుడే కొండంత బలాన్ని సరఫరా చేస్తాడు!

ఏది ఏమైనప్పటికీ-

దోషులు నూరు మంది శిక్ష నుండి తప్పించుకున్నా - నిర్దోషి ఒక్కరికైనా శిక్ష పడకూడదనేది కోర్టు వారి ధ్యేయం!

టాన్సీ భూముల కొనుగోలు సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత విషయంలో "ఇదే జరిగింద"ని స్వాభిప్రాయం!

ఈ సంచికలో . . .

ఔరా!	. . . 3
కనదగు నెవ్వరు గీచిన...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
టూరిస్ట్ గైడ్	. . . 21
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...



హైటెక్ కూలి

కథ ... 8



దూరపుకొండలు

రియల్‌స్టోరీ . . . 14, 15



గుండెపోటును నివారించడం ఎలా?

ఆరోగ్యం . . . 18

గురజాడ ఆధిక్యానికి కారణాలు

కళాసాహితి . . . 22

ఔరా!

శ్రద్ధాంజలి



పై ఫోటో చూస్తే ఏమనిపిస్తోంది? ఇద్దరు వ్యక్తులు మృతవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్లుగా ఉంది కదూ? ఫోటోలో కనిపించేది విగ్రహాలే. వాటికి ఎదురుగా కనిపించేవన్నీ మొదటి ప్రపంచ యుద్ధంలో మృతి చెందిన బెల్జియం సైనికుల సమాధులు. దేశ రక్షణలో అమరులైన వారికి బెల్జియంలోని వ్లోవ్‌స్లో నగరంలో సామూహిక సమాధులు ఏర్పాటుచేశారు. వారి త్యాగాలను అనుక్షణం స్మరించుకునే ఉద్దేశంతో ఆ సమాధుల వద్ద తమ బిడ్డలకు నివాళులర్పిస్తున్నట్లుగా వృద్ధ దంపతుల విగ్రహాలు ఏర్పాటుచేశారు. నిజంగా ఆశ్చర్యంగా ఉంది కదూ! ప్రతి ఏటా పదకొండో నెల (నవంబర్) పదకొండో తేదీ ఉదయం పదకొండు గంటలకు మృతసైనికులకు నివాళులర్పించేందుకు యూరప్ ఖండం స్తంభించిపోతుంది. ఎందుకంటే 1918 సంవత్సరం ఇదే సమయాన మొదటి ప్రపంచ యుద్ధం ఆగిపోయింది. తుపాకులు శాంతించాయి. ఈ నెల 11వ తేదీన బెల్జియంలోని పైన పేర్కొన్న సమాధుల వద్ద వేలాది మంది బారులు తీరి తమ దేశరక్షణలో ప్రాణాలు విడిచిన వీర సైనికులను స్మరించుకున్నారట!

మీకు తెలుసా?

1800 సంవత్సరంలో అమెరికాలోని న్యూయార్క్ నగర జనాభా, మన దేశంలోని బెంగుళూరు నగర జనాభా ఒకే విధంగా ఉండేదిట! మరిప్పుడు ఎలా ఉందో తెలుసా? 2001 లెక్కల ప్రకారం న్యూయార్క్ జనాభా కంటే బెంగుళూరు జనాభా ఐదు రెట్లు ఎక్కువట!

హెరాయిన్ వంటి మత్తుపదార్థాలకు ముడిపదార్థమైన నల్లమందు పండించే పాకిస్తాన్ రైతు ఒక కిలోగ్రాముకు పొందే ధర 90 అమెరికా డాలర్లు.

నల్లమందు నుండి తయారయ్యే హెరాయిన్ పాకిస్తాన్‌లోని హోల్‌సేల్ మార్కెట్లోకి వెళ్ళే సరికి దాని ధర కిలోకు 2,870 డాలర్లు పలుకుతుంది.

ఈ హెరాయిన్ పాకిస్తాన్ నుండి అమెరికాలోని హోల్‌సేల్ మార్కెట్లకు వెళ్ళే సరికి దాని ధర కిలోకి 80 వేల డాలర్లు అవుతుంది. చివరకు అమెరికా, యూరప్ దేశాల్లోని మాదక ద్రవ్యాల బానిసలకు చేరేసరికి 40 శాతం స్వచ్ఛత గల హెరాయిన్ ధర కిలోకు 2,90,000 డాలర్ల ధర పలుకుతుందట!

అమెరికా అధ్యక్షుడుగా జార్జి డబ్ల్యు బుష్ ఎన్నికయ్యాక ఈ మూడు సంవత్సరాలలో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ మూడు సంవత్సరాల కాలంలో మొత్తం 27 లక్షల మంది ఉద్యోగాలు పోయి వీధుల పాలయ్యారట!

కనదగు నెవ్వరు గీచిన...







గంట నుండి అలిపిరీ, వేలుడంటున్నాడే గానీ ప్రసంగించడం లేదు...!



* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

చెక్కిలి మీద చెయ్యి పెట్టుకుని శూన్యం వైపు చూస్తున్న ఆ యువకుడు ఉరిశిక్ష పడ్డ ఖైదీలాంటి వాడు. నేడో రేపో కబళించబోయే మృత్యువును ఎలా ఆహ్వానించాలో తెలియక చిక్కి శల్యమైపోయి జీవచ్ఛవంలా తయారయ్యాడు. ఉన్నత జీవిత శిఖరాల్లోంచి అదఃపాతాళానికి జారిపోయిన అతని బతుకు పుస్తకం ఎయిడ్స్ రాక్షసికి అంకితం... చేసిన తప్పుల్ని దిద్దుకోలేక చీకటి ఆనందానికి బలి పశువుగా తయారై జీవితాన్ని కోల్పోతున్న ఎందరో అభాగ్యుల జీవన వైచిత్రికి ప్రత్యక్ష తార్కాణం... అతనే కాదు వందలాది మంది రోజూ ఇదే విధంగా మృత్యుముఖంలోకి జారిపోతున్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుడు తన భార్యను కాపురానికి పంపించమని వేధిస్తుండగా... అతనితో జీవితాన్ని పంచుకోలేక వ్యతిరేకించిన అభాగ్యురాలు.. ఆమె అన్నలు పథకం ప్రకారం ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుణ్ని హత్య చేయడం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిన్న మొన్నటి తాజా ఉదంతం... తనకు హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉందని అది తన భార్యకు కూడా సోకిందని తాను ఆత్మహత్య చేసుకుంటూ ఆమెను హత్య చేయడం... ఇద్దరు పిల్లల్ని అనాథలుగా చేయడం విశాఖ జిల్లా పెందుర్తిలో ఏడాది క్రితం జరిగినా ఎవరూ మరచిపోని సంఘటన.

తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం పెరవరం గ్రామానికి చెందిన యువకుడు తనకు ఎయిడ్స్ వ్యాధి ఉందని గుర్తించి మరెవరికీ వ్యాప్తి చెందకుండా తల్లిదండ్రులు, అక్క భార్య, కన్నబిడ్డల్ని వేటకొడవలితో నరికి తాను ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం ఎయిడ్స్ పట్ల ప్రజల్లో పేరుకుంటున్న భయానికి పరాకాష్ట.

మానవాళిని కబళిస్తోన్న ఎయిడ్స్ భూతం

ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పులిరాజా ప్రకటనలతో ప్రభుత్వం హోరెత్తించింది. ఇంతవరకూ నామమాత్రంగా ఎవరికీ అర్థంకాని విధానంలో ప్రచారం జరగ్గా 'పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా?' అన్న ప్రకటన కొత్త వివాదానికి తెరలేపింది. ప్రకటనల పరంపరలతో మహిళల్ని కించపరుస్తున్నారని మహిళా సంఘాలు అభ్యంతరం చెప్పాయి. ఏమైనప్పటికీ ఈ ప్రకటన అందరి దృష్టినీ ఆకర్షించినట్లయింది. ఇటువంటి ప్రకటనలు ఎన్ని విడుదల చేస్తున్నా, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు అందరిలాగే మనుషుల మధ్య కలిసి మెలిసి జీవించవచ్చునని ప్రచారం చేస్తున్నా ఈ లోకం నుంచి భయంతో సెలవు తీసుకుంటున్న అభాగ్యులు ఎంతోమంది ఉన్నారు. ప్రాణాంతకమైన వ్యాధి అయినందున మానవతా దృక్పథంతో చూడాలని ప్రజల్ని చైతన్యం చేసే కార్యక్రమాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ ఈ వ్యాధి సోకిన వారు రోజురోజుకు కృంగి కృశించిపోయి, ఆఖరికి కుటుంబ సభ్యుల ఆదరణ కూడా కోల్పోతూ తమ అందమైన జీవితాలకు మధ్యలోనే చరమగీతం పలుకుతున్నారు.

అవగాహనా లోపం :

ఎయిడ్స్ వ్యాధిని నిరోధించడానికి, సరైన ప్రచారం చేయడానికి అవగాహనా రాహిత్యం ప్రధాన కారణంగా తయారైంది. రక్తంలో హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉందని తెలియగానే మనిషిలో ఒంటరితనం అలముకుంటుంది. ఏకాకితనం చుట్టుముడుతుంది. ఈ వ్యాధి సోకడానికి అనేక కారణాలు ఉన్నప్పటికీ సమాజం ఇటువంటి వ్యక్తులను సుహృద్భావంతో చూడటం లేదు. లైంగికపరమైన కారణాల వల్ల ఈ వ్యాధి వస్తుందన్న ప్రచారం మాత్రమే ఎక్కువగా



ఉంది. కుటుంబంలో ఒక వ్యక్తి ఈ వ్యాధి బారిన పడితే మొత్తం ఆ కుటుంబ సభ్యులందరినీ ఏహ్యభావంతో చూడటం మన సమాజంలో నిత్య కృత్యం అయిపోయింది. శరీరానికి ఇతర రకాలైన ఏ రుగ్మతలు వచ్చినా కాపాడుకోవడానికి, వ్యాధులతో పోరాటం చేసి జీవిత కాలాన్ని పెంచడానికి అందరూ ప్రయత్నాలు చేస్తారు. ఎయిడ్స్ విషయంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. కొంతమంది వ్యక్తిగతంగా వారి ప్రమేయం ఏమీ లేకపోయినా బ్లడ్‌బ్యాంక్ వారి నిర్లక్ష్యం, ఇంజక్షన్ కారణంగా ఈ మహమ్మారి వ్యాపిస్తోంది. ఇందువల్ల ఏ పాపం తెలియని కుటుంబ సభ్యులు కూడా ఈ వ్యాధులకు గురవుతున్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించి సమగ్ర కార్యాచరణ పథకాలను అమలు చేయడం లేదు. నీతి, నియమాలకు కట్టుబడి ఉండాలని, జీవిత భాగస్వామితో మాత్రమే లైంగిక సంబంధాలు కొనసాగించాలని ప్రచారాలు మొదట్లో జరిగాయి. వ్యాధి సోకడానికి ఎన్నో ప్రధాన కారణాలు ఉన్నప్పటికీ ప్రచారం మాత్రం ఈ విధంగానే జరుగుతోంది. మన సమాజంలో లైంగిక విషయాలను చర్చించడం, ఆలోచించడం పాపంగా భావించడం వల్ల అవగాహనా రాహిత్యం ఏర్పడింది. మానవత్వంతో రోగిని ఆదరించాలి. వారితో కలిసి జీవించినా వారి వస్తువులు ఉపయోగించినా ఫర్వాలేదన్న విషయంలో సరైన ప్రచారం జరగడం లేదు. దాంతో భయంతోనూ, అవమానంతోనూ మృత్యులోయలోకి దూకుతున్న అభాగ్యులు ఎంతోమంది తయారవుతున్నారు.

ధైర్యాన్ని నూరిపోయాలి :

ఎయిడ్స్ రోగుల్ని విపరీతంగా భయపెట్టే విధానంలోనే ప్రస్తుత ప్రచారం కొనసాగుతోంది. సభ్య సమాజంలో వారు కూడా సభ్యులుగా కొనసాగాలన్న



హెచ్.ఐ.వి. నిర్ధారించే పరీక్ష కిట్లు... తాత్కాలిక నివారణ మందులు

విధానంతో ప్రచారం జరగడం లేదు. పిరికితనాన్ని పారద్రోలి ధైర్యాన్ని నూరిపోసే ప్రచారాలను ప్రభుత్వ వరంగా కొనసాగించవలసిన అవసరం ఉంది. వ్యాధి గురించి అవగాహన కలిగించడం, అందరితో పాటు మరి కొన్నాళ్ళు జీవించవచ్చునని ధైర్యాన్ని ఇస్తూ ప్రకటనలు తయారు చేయాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ విభాగం నిర్ణయించింది. అయితే భయాందోళనలకు గురి చేసే ప్రకటనలకిస్తున్న ప్రాధాన్యం సంరక్షణకు ఇవ్వకపోవడం లోపంగానే నిపుణులు భావిస్తున్నారు. వ్యాధి బారిన పడిన వారు తమ దుస్థితిని ఎవరికీ చెప్పుకోలేక, దిగమింగుకోలేక అవస్థలు పడుతున్నారు. వీరికి కౌన్సిలింగు నిర్వహించే కేంద్రాలు ఆదుకొనే దాతలు ఎంతో మంది ఉన్నప్పటికీ వాటి సమాచారం గుర్చి ప్రచారం చేయడం లేదు. ఎయిడ్స్ వ్యాధి వ్యాపించడానికి ప్రధాన కారకులుగా భావించిన సెక్స్ వర్కర్లు, లారీ డ్రైవర్లకు ప్రత్యేకమైన అవగాహన కలిగిస్తున్నట్లు అధికార వర్గాల రికార్డులు తెలియజేస్తున్నా వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు.

పెరుగుతున్న ఎయిడ్స్ బాధితులు

మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ వ్యాధి బారిన పడుతున్న వారు రోజురోజుకు ఎక్కువ అవుతున్నారు. ఇంతవరకూ దేశంలో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు 80 లక్షల మంది ఉండగా వారిలో 20 లక్షల మంది ఇప్పటికే మృతి చెందారు. మిగిలిన వారు మృత్యుముఖంలోకి జారిపోతున్నారు. ప్రపంచంలో రోజుకు సగటున 16 వేల మంది, మన దేశంలో మూడు వేల మంది చనిపోతున్నారు. మన దేశంలో ముంబయి, చెన్నయ్, పుణె, హైదరాబాద్, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు ఎక్కువ మంది ఉన్నారని ప్రభుత్వ రికార్డులు తెలియజేస్తున్నాయి. చిత్తూరు, విశాఖ, కర్నూలు, వరంగల్ జిల్లాలు కూడా ఎయిడ్స్ బారిన పడ్డాయి. మన రాష్ట్రంలో జాతీయ రహదారుల వెంబడి వ్యభిచారం, సంచార జీవితానికి అలవాటు పడిన వారు ఈ వ్యాధి వ్యాప్తికి కారకులు అవుతున్నారు. రక్తంలో హెచ్.ఐ.వి. పాజిటివ్ గుర్తించలేని అసమర్థులైన వైద్యులు కూడా దోహదపడుతున్నారు. డిస్పోజబుల్ సిరంజులు వాడకుండా కొంతమంది ఒకే సూదితో అనేక మందికి ఇంజక్షన్లు చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో పద్నాలుగు ప్రధాన బ్లడ్‌బ్యాంకుల్లో 34,282 రక్తసేకరణ బాటిళ్ళలో రక్తాన్ని పరీక్షించగా వాటిలో 305 కేసులు హెచ్.ఐ.వి. పాజిటివ్‌గా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కొంతమంది వైద్యులు 'ఎయిడ్స్ వైరల్ లోడ్ టెస్టులు' పేరుతో చౌకబారు వైద్య పద్ధతుల ద్వారా సామాన్యులను మోసగిస్తున్నారు.



జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ

ప్రపంచ వ్యాప్త కృషి

ఎయిడ్స్ వ్యాధి గుర్చి ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. దక్షిణాఫ్రికాలో ఎక్కువమంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు వున్నారు. కౌన్సిలింగు ద్వారా వ్యాధి పీడితులకు అవగాహన కలిగించడానికి, బాధితుల కోసం ప్రత్యేక గృహాలను నిర్వహించడానికి దేశ విదేశాల్లో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయి. మన దేశం మాత్రం ప్రభుత్వం తప్ప ఇతర సంస్థల కృషి అంతంతమాత్రంగానే ఉంది. 1992లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ ప్రచారానికి విరివిగా నిధులను కేటాయించింది తప్ప సంరక్షణ చికిత్సల విషయంలో చేసిందేమీ పెద్దగా లేదు. మొదటి దశలో సంరక్షణ చికిత్సల కోసం 4 శాతం నిధుల్ని కేటాయించగా రెండవ దశలో మరో 11 శాతానికి నిధుల్ని పెంచింది. ఎయిడ్స్‌తో పోరాటాన్ని ప్రపంచ

ఎయిడ్స్ గురించి :

- ప్రపంచంలో 11.8 కోట్ల యువతీ యువకులు (15–24 సంవత్సరాల మధ్య వారు) ఎయిడ్స్ వ్యాధితో జీవిస్తున్నారు. భారతదేశంలో 60 లక్షల మంది ఉన్నారు.
- ప్రతిరోజూ సుమారు ఆరు వేల మంది యువతీ యువకులు హెచ్.ఐ.వి. బారిన పడుతున్నారు.
- ఆంధ్రప్రదేశ్‌లో 20 శాతం జనాభా కన్నా తక్కువ మందికి మాత్రం హెచ్.ఐ.వి. పట్ల సరైన అవగాహన ఉంది.
- హెచ్.ఐ.వి. సోకిన వ్యక్తి ఉమ్మిద్వారా గాని, గాలి ద్వారా కాని ఎయిడ్స్ వ్యాపించదు. ఇది అంటువ్యాధి కాదు.
- ప్రాథమిక స్థాయిలో కూడా ఎయిడ్స్ వ్యాధిని నయం చేయడం కష్టం. ఎయిడ్స్‌కు మందులేదు.
- ఒకరికన్నా ఎక్కువ మంది సెక్స్ సంబంధాలు కలిగి ఉండటం, వేశ్యలతో సెక్సులో పాల్గొనడం, కండోమ్ లేకుండా వేశ్యలతో సెక్స్‌లో పాల్గోవడం ఒక పురుషుడు మరొక పురుషునితో అరక్షిత సెక్స్‌కు పాల్పడటం, ఇంజక్షన్ ద్వారా మత్తు మందులు పుచ్చుకోవడం, హెచ్.ఐ.వి. లేదని నిర్ధారించకుండా రక్తమార్పిడి చేయించుకోవడం వల్ల ఎయిడ్స్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

హెచ్.ఐ.వి. గురించి :

హెచ్.ఐ.వి. అనేది తరచూ వినిపించే మాట హెచ్ (హ్యూమన్) ఐ (ఇమ్యునో డెఫిషియన్సీ) వి (వైరస్) అని అర్థం. ఇది మనిషి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను క్షీణింప చేసే సూక్ష్మక్రిమి. ఈ క్రిమి శరీరంలో ప్రవేశిస్తే రోగ నిరోధక వ్యవస్థ బలహీనపడి మనిషికి అనేక రోగాలు వస్తాయి. రక్తంలో హెచ్.ఐ.వి. పాజిటివ్ అంటే అనేక రోగాలు ఒకేసారి వచ్చే స్థితి. దీనినే ఎయిడ్స్ సోకినట్లు భావిస్తారు.

ఆరోగ్యకరమైన మనిషి శరీరంలో రోగ నిరోధక శక్తి అంటురోగాలు రాకుండా చేస్తుంది. రోగ కారణమైన సూక్ష్మక్రిములు శరీరంలో ప్రవేశించినపుడు తెల్ల రక్తకణాలు వీటితో పోరాడి వాటిని నాశనం చేస్తాయి. రోగాలు సోకకుండా చూస్తాయి. హెచ్.ఐ.వి. సోకితే అది తెల్ల రక్తకణాల్లో ప్రవేశించి అక్కడ ఉండిపోతుంది. దాంతో ఈ కణాల సంఖ్య తగ్గిపోయి క్రమంగా నశించిపోతాయి.

2000 సంవత్సరంలో పరాయి వ్యక్తులతో సెక్స్‌లో పాల్గొన్న వ్యక్తుల శాతం



ప్రవర్తనా నిఘా సర్వే, 2001 జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ



ఎయిడ్స్‌పై పరిశోధనలు ఇంకా ప్రయోగశాలలు దాటలేదు

వ్యాప్తంగా చేపట్టడానికి ఐక్యరాజ్యసమితి వెయ్యికోట్ల డాలర్లతో ఒక కార్యాచరణ పథకాన్ని రూపొందించింది. ఎవరు ఎన్ని రకాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగితే తప్ప ఈ వ్యాధిని నిరోధించడం కష్టం.

వాక్సిన్ తయారీకి ఇంకా ఎన్నాళ్ళు?

ప్రపంచాన్ని వణికిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని నిరోధించడానికి తగిన వాక్సిన్ కనుగొనడానికి దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. మూలికా వైద్యం ద్వారా తగ్గించవచ్చని ఈ మందు తయారీకి డ్రగ్ కంట్రోల్ అథారిటీ అనుమతి ఇవ్వాలని కొంతమంది వైద్యులు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. విషయం ఎంత వాస్తవమైనా ప్రయత్నాలు మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ఊపందుకున్నాయి. గత నెల న్యూయార్కులో ఎయిడ్స్ వాక్సిన్ల రూపకల్పనకై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ వాక్సిన్ తయారీ ఎంతోదూరంలో లేదని శాస్త్రవేత్తలందరూ ఆకాంక్షించారు. ఇంతవరకూ ప్రపంచ వ్యాప్తంగా 12 వేల మందిపై ఎయిడ్స్ వాక్సిన్లు ప్రయోగాత్మకంగా పరిశీలించారు. మెర్క్‌వంటి పది పెద్ద మందుల కంపెనీలు కోట్ల డాలర్ల సొమ్ము ఇందుకోసం వెచ్చిస్తున్నాయి.

వాక్సిన్ తయారు చేయడానికి శాస్త్రవేత్తలు రెండు ప్రధానమైన మార్గాలను అన్వేషిస్తున్నారు. శరీరంలో రోగనిరోధక శక్తి హెచ్.ఐ.వి. వైరస్ వల్ల నాశనం అవుతుంది. దానిని



కృత్రిమంగా ప్రేరేపించి 'యాంటీబాడీ'లు తయారయ్యేలా చూడటం. ఇంక రెండవ విధానంలో శరీరంలో ఎయిడ్స్ ఇన్ఫెక్షన్‌కు గురైన కణాలను గుర్తించి ఎప్పటికప్పుడు నిర్మూలించడానికి కిల్లర్-టి-సెల్స్ (సైటోటాక్సిన్ టీ లింఫోసైట్లు) అనే కణాలకు శిక్షణ ఇవ్వడం ద్వారా కృషి చేయడం. అయితే వీటిలో యాంటీబాడీలను తయారు చేసే పద్ధతే సమర్థమైనదని పరిశోధకులు గుర్తించారు. నార్త్ కెరొలినా విశ్వవిద్యాలయం పరిశోధకులు తాము తయారు చేసిన వాక్సిన్ కొంతమంది మనుషులకు ఇచ్చి కొంతమేర పురోగతి సాధించారు. ఇరవై ఏళ్ళ క్రితం ఎయిడ్స్ వ్యాధి కారక వైరస్‌ను కనుగొన్న బృందంలో సభ్యులైన రాబర్ట్ గాలో కూడా ఒక వాక్సిన్ రూపొందించి ప్రయోగించబోతున్నారు. ఈయన యూనివర్సిటీ ఆఫ్ మేరీలాండ్‌లో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ వైరాలజీ' శాఖకు అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఎయిడ్స్ వాక్సిన్ తయారీ కనుచూపు మేరలోనే ఉంది.

నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం!

రాష్ట్రంలోనూ, దేశంలోనూ ప్రధాన సమస్యగా తయారైన ఎయిడ్స్ విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాయి. రాష్ట్రంలో ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, దేశ స్థాయిలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) ఇందుకోసం కృషి చేస్తోంది. ఈ సంస్థ అధ్యయనంలో మన రాష్ట్రంలో నాలుగు లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వున్నట్లు గుర్తించారు. అనధికారికంగా మరెంతో మంది ఈ వ్యాధితో బాధపడుతున్నారు. బాధితుల్ని ఆదుకోవడం కోసం ఈ వ్యాధి కారణంగా ఉద్యోగాలను కోల్పోయిన వారికి మానసిక స్థయిర్యాన్ని ఇవ్వడం కోసం రాష్ట్రంలో 114 సేవా సంస్థలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి. రాష్ట్రంలో హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉన్న కేసుల్ని ప్రభుత్వం మూడు రకాలుగా గుర్తిస్తోంది. బ్లడ్‌బ్యాంకులు రక్తం పరీక్షించడం ద్వారా 14 శాతం, లైంగిక వ్యాధుల చికిత్సా కేంద్రాలకు వచ్చే వారిలో 28 శాతం, గర్భవతుల్లో 2.15 శాతం హెచ్.ఐ.వి. వైరస్ ఉన్నట్లు కనుగొంది. గ్రామాల్లో ఏర్పడిన స్వయం సహాయ సంఘాలతో పాటుగా కళాకారులు, గాయకులు, సినీనటుల ద్వారా ఆడియో టేపుల్లో సందేశాలు ఇప్పించడం నాటకాలు, రూపకాలను ప్రదర్శించడం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రసార మాధ్యమాలు కూడా ఇందుకోసం ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం. ఎయిడ్స్ గూర్చి చర్చిద్దాం అన్న నినాదం ద్వారా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రాష్ట్రంలో కృషి ప్రారంభించింది. మందు లేనందున నివారణ ఒక్కటే మార్గం అంటూ ప్రభుత్వం ఎలుగెత్తి చాటుతోంది. ఈ మహమ్మారి కేవలం సురక్షితం కాని లైంగిక చర్యల వల్లనే సంక్రమిస్తుందనే కోణంతోనే ప్రభుత్వ ప్రచారం అధికంగా సాగుతోంది. ఇతర విషయాలను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం ప్రచారం ఎంతగా చేస్తున్నా రాష్ట్రంలో ఎయిడ్స్ అంతకంతకూ పెరుగుతోంది. సామాజికాంశాలను పరిగణనలోకి తీసుకోనందునే ప్రభుత్వ ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదని నిపుణులు భావిస్తున్నారు. ●

హెచ్.ఐ.వి. నిర్ధారణ ఎలా?

రక్త పరీక్ష ద్వారా మాత్రమే హెచ్.ఐ.వి. క్రిమి శరీరంలో ఉందో లేదో తెలుస్తుంది. మామూలు రక్త పరీక్షల ద్వారా ఈ విషయం తెలుసుకోవడం చాలా కష్టం. హెచ్.ఐ.వి. వైరస్‌తో పోరాడే రక్షణ కణాలు (యాంటీబాడీస్) ఉన్నదీ లేనిదీ ఈ పరీక్ష ద్వారా తెలుస్తుంది. ఈ పరీక్షలో పాజిటివ్ అని తేలితే హెచ్.ఐ.వి. సోకినట్లు గుర్తించాలి. నెగిటివ్ అని తేలితే అంతకు ఆరు నెలల ముందు కాలంలో హెచ్.ఐ.వి. సోకడానికి ఆస్కారమిచ్చే ప్రవర్తనకు మీరు పాల్పడకపోతే మీకు ఈ వైరస్ సోకలేదని నిర్ధారించుకోవచ్చు. రక్తంలో హెచ్.ఐ.వి. ప్రవేశించిన తర్వాత రక్షణ కణాలు (యాంటీబాడీస్) ఉత్పత్తి కావడానికి అనుమానాల వ్యవధి [illegible] పడుతుంది. ఈ కాలాన్ని విండో పీరియడ్ అంటారు.

హెచ్.ఐ.వి. సోకితే వచ్చే మార్పులు:

[illegible]

✻ దర్శన్

హైటెక్ కూలి



"సురేష్, రేపు ఉదయం సబ్-డివిజనల్ ఆఫీసుకు వెళ్ళొస్తావా!"

"ఎందుకు?"

"ఆ ఆఫీసర్ నాకు తెలిసిన వాడు. బజార్లో కన్పించాడు. యోగక్షేమాలు అడుక్కున్నాం. డిగ్రీ చదివి నువ్వు ఖాళీగా ఉన్నావని చెప్పాను. నిన్ను క్యాజువల్‌గా డిస్పాచ్ సెక్షన్‌లో పెట్టుకుంటానన్నాడు" వివరించి చెప్పాడు ఆ తండ్రి. సురేష్ ఆలోచనలో పడ్డాడు.

"నీ చదువుకు తగ్గ పోస్టు కాదని ఆలోచిస్తున్నావా బాబు. అనుభవం మీద చెప్తున్నాను. ఆ పని దొరకడం కూడా కష్టమేరా. తెలిసిన అధికార్లు ఉంటే తప్ప తీసుకోరు" కొడుక్కి నచ్చ చెప్పాడు. ఆ కొడుకు మనస్సులో ఏ ఆలోచన్లు ముసురుతున్నాయో!

డిగ్రీ అయిపోయి రెండు సంవత్సరాలు దాటింది. కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఏడాది దాటింది. ఇట్లా కంప్యూటరు నేర్చుకుంటే అట్లా ఉద్యోగం వచ్చేస్తుందని నమ్మి ఇరవై వేలు పోసి ఆ కోర్సు చేశాడు. ఆ క్లాసులకు వెళ్ళినన్ని రోజులు అయిదంకెలు దాటిన నెల ఆదాయాన్ని ఊహించుకుంటూ రొమ్ములు విరుచుకొని వెళుతుండేవాడు. తన్ను ఓ కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా ఊహించుకొని బంగారు కలలు ఎన్నో కన్నాడు. కాని ఇప్పుడు ఆర్నెల్ల కింద రిటైరైన తండ్రిని పాకెట్ మనీ అడగలేక జేబులో పైకం లేకుండా పాత ప్యాంట్లు వేసుకొని మిత్రులతో కాలం గడుపుతున్నాడు. ఆ మిత్రులదీ అదే పరిస్థితి. ఇంటి ఆర్థిక పరిస్థితికి సురేష్ తలవంచక తప్పలేదు.

'ఇన్ని మాటలెందుకు నాన్నా. నేను ఆ పని చేయలేను అని చెప్పలేదుగా. వెళ్తాను. వెళ్ళి ఎవర్ని కలవాలి' అన్నాడు సురేష్.

డిగ్రీ, కంప్యూటర్ కోర్సు చేసిన తన కొడుకు ఆ చిన్న పనికి అదీ క్యాజువల్‌గా వెళ్ళడానికి ఒప్పుకోవడంతో ఆ తండ్రికి కొంత ఊరట అన్పించింది.

"ఏందోరా. కంప్యూటర్ నేర్వగానే అట్లా ఎగురేసుక పోయి ఉద్యోగమిస్తారని ఊరించిరి. వేలకు వేలు తగలేసి కోర్సు చేస్తే పని దొరికింది లేదు. ఆ ఇరవై వేలు మిత్తితో ఇరవై అయిదు వేలు అవును. పచారి కొట్టు పెట్టుకున్నా పెట్టుబడికి ఆసరా అయ్యేది" అన్నాడు. కొడుకు ఏమీ మాట్లాడలేదు.

రోజుకన్నా ఓ అరగంట ముందు నిద్రలేచాడు సురేష్. నిన్నటి దాకా లేచి చేయాల్సిన పని ఏమీ లేనందున నిదానంగా లేచేవాడు. టిఫిన్ చేసి ఆఫీస్ అడ్రస్సు, కలవాల్సిన అధికారి పేరు తండ్రిని అడిగి తెలుసుకొని బయల్దేరాడు.

* * *

పేరుకు డిస్పాచ్ క్లర్కు కాని అన్ని పనులు చెప్తున్నారు. ప్రతి గుమాస్తా తన్ను దగ్గర కూర్చోబెట్టుకొని డిక్టేషన్ చెప్తుంటాడు. వారి వారి అదనపు పనినంతా తనకు బదిలీ చేస్తున్నారు. ఆఫీసులో అటెండరు ఒక్కడే ఉన్నాడు. అతడ్ని టీ తెమ్మని, బిస్కట్లు తెమ్మని మరేవైనా పన్ల మీద బయటకు పంపించినప్పుడు "సురేష్ గీ ఫైలు సార్ దగ్గర పెట్టిరా" అని చెప్తుంటారు. ఆ సార్ బెల్లు కొట్టినప్పుడు అటెండర్ లేకపోతే తానే వెళ్ళాల్సి ఉంటుంది. తన్ను మొదట్లో పనిలో పెట్టుకున్న అధికారికి తన తండ్రి తెలుసు కాబట్టి తనకు ఆ పనులు చెప్పేవాడు కాదు. అత్యవసరమైతే సంకోచిస్తూ చెప్పేవాడు. అతడు బదిలీ అయి మరో అధికారి వచ్చాక ఏ పని చెప్పడానికి అయినా సంకోచించ కుండా తన్నో క్యాజువల్ లేబర్‌గానే పరిగణి స్తున్నాడు. రోజుకు అరవై రూపాయల చొప్పున నెలకు ఇరవై అయిదు రోజులకు లెక్కవేసి పదిహేనువందలు ముట్టుతుండేది కొత్తలో. కాని ఈ కొత్త ఆఫీసరు వచ్చాక ఆఫీసు మెయింటె నెన్సుకని ఇచ్చే బడ్జెట్‌లో కోత విధించారని నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే ముట్టచెప్తున్నాడు. అంతకన్నా ఎక్కువ ఇవ్వలేను అన్నాడు. పనేమో అంతకు ముందరి కన్నా రెట్టింపు అయ్యింది. ఆ విషయమే అడిగితే నెలకు ఆరు వందలకు కూడా పని చేసే వారున్నారు. నీ ఇష్టం అన్నాడు. మానేద్దామనుకుంటే తాను ఎదురు చూస్తున్న ఏ ఉద్యోగం రాలేదు. దినపత్రికల్లో వాంటెడ్ కాలమ్స్ చూసి తన బయోడేటా పంపిస్తూనే ఉన్నాడు. ఖర్చులకు కూడా డబ్బులుండవని రాజీపడి సర్దుకుపోతున్నాడు. మునుపు అయిదొందలు తాను ఉంచుకొని తండ్రికి వెయ్యి రూపాయలిచ్చేవాడు. ఇప్పుడు నాలుగు వందలు ఉంచుకొని ఆరువందలు ఇస్తున్నాడు. కొడుకు భవిష్యత్తు తల్చుకుంటే ఆ తండ్రికి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. తనకొచ్చే పెన్షన్ డబ్బులు కుటుంబ ఖర్చులకు సరిపోని ఇబ్బంది ఒకటి.

* * *

సురేష్ పని చేస్తున్న ఆఫీసుకు కంప్యూటర్

వచ్చింది. చాలా రోజుల్నుంచి కంప్యూటర్ వస్తుందని అనుకుంటున్నారు. ఆ కంప్యూటర్ పని చేయడం గుమాస్తాలకి గాని, జూనియర్ ఆఫీసర్లకుగాని తెలియదు. సురేష్‌కు కంప్యూటర్ మీద పని చేయడం వచ్చు అని తెలుసుకున్న పాత ఆఫీసరు ముందుచూపుతోనే అతడ్ని క్యాజువల్‌గా తీసుకున్నాడు.

ఆఫీసులో ఉన్న సిబ్బందిని దఫాల వారీగా ఒక్కొక్కరిని ఒక్కోనెల కంప్యూటర్ శిక్షణకు పంపించారు. అరకొర పరిజ్ఞానంతో వాళ్ళు ఆపరేట్ చేయలేకపోయారు. కంప్యూటరు ముందు కూర్చోవడం కూడా కష్టతరమే. ఓర్పు లేక వాళ్ళెవరూ సరిగా పని చెయ్యడం లేదు. కంప్యూటర్ డిప్లొమా చేసిన సురేష్ అందుబాటులో ఉండగా శ్రమ ఎందుకని ఆ పనులు అతడికే పురమాయిస్తున్నారు. జీతం మాత్రం పెంచలేదు. ఆఫీసులో ఏం పని చేస్తున్నావంటే కంప్యూటర్ ఆపరేటర్ అని చెప్పుకోవడం వరకు బాగానే ఉంది. జీతం చెప్పుకుంటే మాత్రం నామోషే!

కంప్యూటర్‌కు సంబంధించిన మొత్తం ఫైల్స్, డేటా సురేష్ మెయింటెన్ చేస్తున్నాడు. కొన్ని ఫైల్స్ ఆఫీసర్ మాత్రమే ఆపరేట్ చేయాలి. ఆ ఫైల్స్ పాస్‌వర్డ్ ఆఫీసరుకు మాత్రమే తెలిసి ఉండాలి. అతడు మాత్రమే ఓపెన్ చేయాలి. కాని అతడు సురేష్‌తోనే చేయిస్తాడు. తన పాస్‌వర్డ్ సురేష్‌కు చెప్పేశాడు. ఇక మొత్తం పనులన్నీ సురేష్ మీద పడ్డాయి. గుమాస్తాలకు, ఆఫీసర్‌కు కంప్యూటర్ శిక్షణ పొందినందున అదనపు ఇంక్రిమెంట్లు జీతంలో కలిసాయి. కాని వారెవ్వరు కంప్యూటర్ టచ్ చేయరు.

ఉదయం తొమ్మిది గంటల కన్నా ముందుగానే ఆఫీసుకు వస్తాడు సురేష్. క్రితం రోజు వచ్చిన ఉత్తరాల్ని ఇన్‌వర్డు రిజిస్టర్‌లో ఎంట్రీ వేస్తాడు. ఏ ఏ సీటుకు వెళ్ళాలో మార్క్ వేస్తాడు. పది గంటల కల్లా స్టాఫ్ అంతా వచ్చే సరికి వారి వారికి అందజేస్తాడు. ఔట్‌వర్డు రిజిస్టర్‌లో ఎంటర్ చేసి పోస్టాఫీసులో, కొరియర్ సర్వీసులో అందించి వస్తాడు. పని ముగించుకొని ఆఫీసు నుండి బయటపడేసరికి సాయంత్రం ఏడు దాటుతోంది. ఒక్కోరోజు ఎనిమిది కూడా అవుతుంది. అలిసి ఇంటికొచ్చిన కొడుకును చూసి అతడి తల్లి ఇంత గొడ్డు చాకిరి ఏందిరా అంటుంది. మాన్పిద్దామంటే మరో పని దొరకడం కష్టమే. ఊరికే ఉంటే ఇల్లు గడవడం కష్టమే. సురేష్‌కు వయస్సు పాతికేళ్ళు దాటి రెండేళ్ళు గడిచింది. పెళ్ళి చేద్దామంటే ఇతడి అరకొర ఆదాయానికి పిల్లనెవ్వరు ఇస్తలేరు. ఇచ్చినా ఆ రాబడితో సాకేదెట్లా. కొడుకు భవిష్యత్తు తల్చుకుంటే ఆ తండ్రి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి.

* * *

సురేష్ పని చేసే సబ్‌డివిజనల్ ఆఫీసు ఆవరణలోనే మరో భవనంలో డివిజనల్ ఆఫీసు. కొత్తగా ఏర్పాటైంది. రాంచంద్రం బదిలీ మీద ఆ ఆఫీసులో సెక్షన్ సూపర్‌వైజర్‌గా జాయినయ్యాడు. అతడు జాయినయిన నెల మొదటి వారంలో సబ్‌డివిజనల్ ఆఫీసు మెయింటెనెన్సు బిల్లు స్క్రూటినీకి తన టేబిల్ మీదికి వచ్చింది. మొదటి నెల బిల్లు స్క్రూటినీ చేస్తున్నప్పుడు కాంట్రాక్టు కూలీకి వేజెస్ చెల్లించినట్లు కొన్ని వోచర్లు గమనించాడు. సురేష్ తన ఆఫీసు లెటర్స్ తెచ్చిఇచ్చి తన ఆఫీస్ డాక్ తీసుకుపోతుంటాడు. అయితే అతడి పేరు మీద ఒక్క ఓచరు కూడా తగల్లేదు. మొదటి నెల కాబట్టి అతడు లోతుగా పరిశీలన చేయలేదు. రెండో నెల బిల్లు స్క్రూటినీకి వచ్చినప్పుడు సమయం వెచ్చించి నిశితంగా పరిశీలించాడు.

మొదటి పది రోజులకు పదొండలు, పదకొండు నుండి ఇరవయ్యో తేదీ వరకు మరో పదొండలు, ఇరవై ఒకటి నుండి నెలాఖరు వరకు ఆరొండలకు మూడు ఓచర్లు ఉన్నాయి. ఫైళ్ళు కుట్టడానికని, ఉత్తరాలు ఇచ్చి రావడానికని, గార్డెనింగు కని, ఇంకేదో పని అని రాములు, మల్లయ్య, చంద్రుడు అని పేర్ల మీద ఉన్నాయి. రాంచంద్రంకు విషయం అర్థమైంది. ఆ మధ్యాహ్నం లెటర్సు తీసుకొని వచ్చిన సురేష్‌ను అతడు ఏ ఏ



పనులు చేస్తుందీ అడిగి తెలుసుకున్నాడు. అతడికి నెలకు ఎంత మొత్తం ఇస్తున్నారో తెలుసుకున్నాడు. సురేష్ చేసే పనికి కనీసం ఒక ఎల్డీసీని నియమించినా అయిదారువేలు జీతం ఇవ్వాలి. అటెండరుక్కూడా నాలుగువేల దాకా ఉంటుంది. హెడ్డాఫీసులో కంప్యూటర్ మీద పని చేసే క్యాజువల్స్‌కు స్కిల్డు లేబర్ కింద రోజుకు వంద రూపాయల చొప్పున రెండున్నర వేలు ఇస్తున్నారు. ఇక్కడ వివిధ పేర్ల మీద రెండు వేలు డ్రా చేసి వెయ్యి రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. మిగతా వేయి రూపాయలు సబ్ డివిజనల్ అధికారి జేబులో వేసుకుంటున్నాడు.

రాంచంద్రం యూనియన్ కార్యకర్త. ఈ విషయాల్లో బాగా అవగాహన ఉన్నవాడు. అధికార్లు కూడా అతడి మాటని గౌరవిస్తారు. అతడు అక్కడ జాయినైన రోజునే జూనియర్ అధికార్లు పరిచయం చేసుకున్నారు. తమకు కూడా ఏదైనా మాట సహాయంగా ఉంటాడని, విధి నిర్వహణలో తగు సలహాలు ఇచ్చి ఉపయోగపడ్తాడనే భావనతో.

“నీలో ఇంత స్కిల్లు ఉంది. ఓపికా ఉంది. ఆఫీసులో చాలా పనులు చేస్తున్నావ్. అటెండర్ పని నుండి కంప్యూటర్ పనిదాకా చేస్తున్నావ్. మరీ వెయ్యి రూపాయలకే ఎందుకు చేస్తున్నావ్. రెండు వేలకు బిల్లు పెడ్తున్నారు. ఆ రెండు వేలైనా నీకివ్వొచ్చుగా” సురేష్‌ని అడిగాడు రాంచంద్రం.

‘అడిగాను సార్. నీ ఇష్టముంటే చేయి, లేకపోతే లేదు. చాలా మంది పని లేకుండా తిరుగుతున్నారు. అయిదారు వందలకు కూడా చేసే వారున్నారు అంటున్నారు సార్’.

అయిదంకెల్లో జీతం ఉంటుందని భ్రమలు కల్పిస్తే వేలకు వేలు పోసి కంప్యూటర్ నేర్చుకుంటిరి. ఉపాధి లేక గ్రాడ్యుయేట్లు కంప్యూటర్ నేర్చుకొని అడ్డామీద కూలీలుగా మారిండ్రు. ఉపాధి కల్పనలో ప్రామాణిక వేతనాల్లో మోడల్‌గా ఉండాల్సిన ప్రభుత్వమే నిరుద్యోగితను ఆసరా చేసుకొని తాను కూడా లాభపడాలనుకొని తన విద్యుక్త ధర్మాన్ని మరిచింది. ఈ వైఖరి ప్రైవేటు యాజమాన్యాలకు కూడా తక్కువ వేతనాలిచ్చి శ్రమ దోపిడి చేయడానికి ఆస్కారం కల్పిస్తుంది. ఇదే అవకాశమని ఇలాంటి ఎన్జీవోలు రెండు వేలు ఖర్చు రాసి వేయి రూపాయలే ఇస్తున్నారు. ఇతర చోట్ల కూడా ఎనిమిదొందలు ఇస్తున్నట్లు నైట్‌వాచ్‌మెన్‌లకు ఓచర్లు పెట్టి అయిదొందలే ఇస్తున్నారు. వ్యవసాయం సాగక గ్రామాల్లో కూలీనాలి దొరక్క ఎంతిచ్చినా సరిపెట్టుకునే స్థితి. నీకు కంప్యూటర్ మీద ప్రావీణ్యం ఉంది. ఎక్కడైనా ఫుల్‌టైం జాబుకు ప్రయత్నించి చూశావా”

‘మా ఫ్రెండ్స్ ట్రై చేశారు. చేస్తూనే ఉన్నారు. ఎవ్వరికీ దొరకలేదు. వృథా ఎందుకని నేను ఊరుకున్నాను’.

‘పెద్దసార్ పిలుస్తున్నాడని అటెండర్ చెప్పడంతో రాంచంద్రం డి.ఇ. ఛాంబర్‌లోకి వెళ్లాడు. సురేష్ తనకిచ్చిన ఉత్తరాల్ని తీసుకొని నిష్క్రమించాడు.

“చంద్రంగారు, లోకల్ ‘ఎన్జీవో’ బిల్లుల్ని జాగ్రత్తగా చెక్ చేయండి. ఆయన అక్కౌంట్ సబ్మిషన్ పద్ధతి ప్రకారం ఉండదు. అన్నీ కరెక్టుగా ఉంటేనే మీ ఇనిషల్ వేసి పంపండి నా సంతకానికి. లేకుంటే తిప్పి పంపండి” అన్నాడు డి.ఇ.

పెట్టిన ఓచర్లలో వున్న మొత్తం వాస్తవంగా ఖర్చయినాయో లేదో కాదు కావల్సింది అతడికి. తారీఖులు, హెడ్ ఆఫ్ అక్కౌంటు, ఓచర్ మీద, బిల్లు మీద అడ్రస్సులు సరిగ్గా ఉండాలని అతడి ఉద్దేశం. క్రింది నుంచి పై దాకా ఇది అందరికీ తెలిసిన విషయమే. అక్కౌంటులో చూపెట్టిన ఖర్చు వాస్తవమైందో కాదో పరిశీలన ఉండదు. లెక్క పద్ధతి ప్రకారం రాస్తే చాలు అనే ఉదాసీనత. అయితే ఈ డి.ఇ. కొంచెం నిజాయితీ పరుడని తాను అక్కడ జాయిన్ కాకముందే తెలుసుకున్నాడు. ఈ రెండు నెలల్లో అనుభవం ద్వారా కక్కుర్తి వాడు కాడని అర్థమైంది. రాంచంద్రం తనకు తెలిసిన వాస్తవాలు, పరిశీలనలో గ్రహించిన విషయాలు నిర్మొహమాటంగా చెప్పడానికి ఎప్పుడూ తటపటాయించడు. తాను సర్వీసులో జాయినైన నెల్లో కూడా తటపటాయించలేదు. ఇరవై అయిదేళ్ళ సర్వీసులో

(మిగతా 15వ పేజీలో)

✻ అంపశయ్య నవీన్



రెండూ కావాలండి...

"హలో.... హలో... ఎవరండీ మాట్లాడేది?"

''నేనండీ... గూడెప్పాడు నుండి కమలారాణిని"

"వినబడటం లేదండీ? కాస్త గట్టిగా మాట్లాడ్తారా?"

''నేనండీ... గూడెప్పాడు నుండి కమలారాణిని..."

"మీ టెలివిజన్ వాల్యూమ్ కాస్త తగ్గిస్తారా?"

"అలాగేనండి..."

"ఆఁ... ఇప్పుడు చెప్పండి? ఎక్కణ్ణించి మాట్లాడుతున్నారు..."

"గూడెప్పాడండి.."

"అదేం పాడండి?"

"గూడెప్పాడండి..."

"ఓహో! గూడెప్పాడా? బావుందండి... మీ పేరండి?"

"నా పేరు కమలారాణి అండీ..."

"కమలారాణాండీ... చాలా మంచి పేరండి... మీరేం చేస్తుంటారండి..."

''నేనాండీ! ప్రస్తుతం మీతో మాట్లాడుతున్నానండీ"

"అయ్యో... అదికాదండీ నేనడిగింది... మీ ప్రొఫెషన్ ఏమిటని.."

"ప్రొఫెషనంటూ ఏమీ లేదండి..."

"అంటే... మీరేమీ చెయ్యరా అండీ!"

''ఎందుకు చెయ్యనండి? ఢిగ్రీ చేస్తున్నానుగదండీ!"

"మీరామాట ముందే చెప్పరేమిటండీ... మీరు డిగ్రీ స్టూడెంటన్నమాట... ఏం డిగ్రీ చేస్తున్నారండి..."

"బి.ఏ. చేస్తున్నానండీ!"

"బి.ఏ. చేస్తున్నారా?"

"అదేమిటండీ... అలా అడిగారు... బి.ఏ. అంటే మీకిష్టం లేదాండీ?"

"అలా అని ఏమీ కాదండి... ఈ రోజుల్లో బి.ఏ. ఎవరూ చేయడం లేదు.... ఏ ఎలక్ట్రానిక్సో, ఏ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీయో చేస్తున్నారు కదండీ... అందుకని అలా అన్నాను... మరేం లేదండి... మీరు అఫెండయ్యారా?"

''ఏం లేదండి... నాకసలు అఫెండవడమంటే ఏమిటో తెలీదండి..."

''అంటే మీరు చాలా మంచి వారన్నమాట... మీలాంటి వాళ్ళు ఉండబట్టే ఈ సమాజం ఈ మాత్రమైనా నిజాయితీగా ఉండగల్గుతున్నది"

"అబ్బ! నేనంటే మీకెంత అభిమానమండీ! మీరెంతో గొప్ప యాంకరండీ... రియల్లీ ఐ లవ్‌యూ అండీ!"

"థాంక్సండీ! అది పోనీయండి గానీ, మీ హాబీస్ ఏమిటండి?"

"హాబీసండీ! చాలా ఉన్నాయండీ!"

"ఓ రెండు మూడు చెప్పండి..."

"ఇలా టీవీ ప్రోగ్రామ్స్‌లో మీలాంటి యాంకర్స్‌తో అదే పనిగా మాట్లాడటం నామొట్టమొదటి హాబీ అండీ!"

"చాలా థాంక్సండీ! మీలాంటి వాళ్ళుండబట్టే మాలాంటి వాళ్ళకు చేతినిండా పనిదొరుకుతుందండీ... కీపిటప్ అండీ! మీరెండో హాబీ ఏమిటండీ?"

"సినిమాలు చూడటం అండీ"

"సినిమాలు కాలేజీ ఎగ్గొట్టి చూస్తారా? బోటనీ క్లాస్ ఎగ్గొట్టి మ్యాటినీ షోకు వెళ్తుంటారా?"

"నాకు బోటనీ క్లాసులుండవు గదండీ! నేను బి.ఏ. చదువుతున్నానని మొదటే చెప్పానుగదండీ..."

"సారీ అండీ.. వెరీవెరీ సారీ అండీ... మీరు బి.ఏ. చదువుతున్నారని మరచిపోయానండీ... మీకెవరి సినిమాలంటే చాలా ఇష్టమండి..."

"అందరి సినిమాలూ ఇష్టమేనండి..."

''అందరి సినిమాలూ ఇష్టమేనా? అదేమిటండీ! మీకో అభిమానహీరో అంటూ ఎవరూ లేరా అండీ!"

''హీరోలందరూ నా అభిమాన హీరోలేనండి"

"రియల్లీ... ఫెంటాస్టికండీ! మీరు ఏకంగా హీరోలందర్నీ ప్రేమించేస్తారన్నమాట... మీకు బోయ్‌ఫ్రెండ్సెవరన్నా ఉన్నారా అండీ?"

"ఉన్నారండీ"

"ఎంతమందున్నారండీ?..."

"చాలామందండీ..."

మీరెంత విశాల హృదయులండీ... ఇంతమంది హీరోలను, ఇంతమంది బాయ్‌ఫ్రెండ్స్‌ని ఎలా మెయిన్‌టెయిన్ చేస్తున్నారండీ!"

"ఎలా మెయిన్‌టెయిన్ చేస్తున్నారని అడగడంలో మీ ఉద్దేశ్యమేమిటండీ? నా గురించి మీరేమనుకుంటున్నారసలు..."

"అబ్బే ఏమీలేదండి... మీరు మళ్ళీ అఫెండయినట్టుంది... ఏదో తమాషాకంటే మీరు నిజమే అనుకున్నారా ఏమిటి?"

"నేనూ తమాషాకే అన్నానండీ...

"పోనీయండి గానీ మీకేం కావాలి? మాటకావాలా? పాటకావాలా?"

"రెండూ కావాలండీ.."

"రెండూ కావాలంటే కుదరదండీ"

"అలా అంటే ఎలా అండీ... రెండూ కావాలండీ... కుదరదండీ..."

"కుదరదండీ..."

"........" ●

* పి.ఎం.సుందరరావు

నిజమైన సహాయం

రమేష్ పదవ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులు. అందువల్ల పాకెట్‌మనీ బాగా ఇస్తుంటారు. రమేష్ వాటిని దుర్వినియోగం చేయకుండా అవసరంలో వున్నవారికి, ఆపదలో వున్నవారికి ఇచ్చి సహాయపడుతుంటాడు. బాగా చదువుతూ అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులు సంపాదిస్తుంటాడు. మంచి విద్యార్థిగా, సహాయగుణంగలవాడిగా రమేష్ ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల మన్ననలు పొందుతుంటాడు.

సురేంద్రకూడా పదవతరగతే చదువుతున్నాడు. అతనిని తల్లిదండ్రులు కష్టపడి చదివిస్తున్నారు. అయితేనేం. సురేంద్ర మాత్రం స్కూలుకి సరిగ్గా వెళ్లడు. అన్ని సబ్జెక్టులలో బాగా తక్కువ మార్కులు వస్తుంటాయి. ఉపాధ్యాయులు ఎంత మందలించినా సురేంద్రలో మార్పు రాలేదు.

అప్పుడు ఆరు నెలల పరీక్షలు జరుగుతున్నాయి. రమేష్, సురేంద్ర ఒకే బెంచీలో పక్కపక్కన కూర్చుని పరీక్షలు రాస్తున్నారు. రమేష్ తలవంచుకుని జవాబులు రాసుకుంటున్నాడు. సురేంద్రకు ఆన్సర్లు తెలియక దిక్కులు చూస్తున్నాడు. మెల్లగా రమేష్‌ని గిల్లి ఆన్సర్లు చూపించమని అడిగాడు. రమేష్ పట్టించుకోకుండా రాసుకుంటున్నాడు. కాసేపటి తర్వాత 'నిన్ను అందరూ సహాయ గుణంగలవాడివని పొగుడుతారుకదా. నాకు ఆన్సర్లు చూపించి సహాయం చేయవా' అని బతిమిలాడాడు.

రమేష్ కోపంగా 'ఇంకొక్క మాట మాట్లాడావంటే మాష్టారుకి చెబుతాను. జాగ్రత్త. నీకు వస్తే రాయి. లేకపోతే ఖాళీ పేపరిచ్చి వెళ్లిపో' అన్నాడు. సురేంద్ర కిక్కురుమనకుండా కూర్చున్నాడు.

అప్పటినుంచి సురేంద్రలో పట్టుదల పెరిగింది. రమేష్‌మీద కోపంతో రోజూ స్కూలుకి వెళ్తూ, బాగా చదివాడు. చివరిగా జరిగిన పబ్లిక్ పరీక్షల్లో బాగా రాశాడు. ఫస్టు క్లాసులో పాసయ్యాడు. రమేష్ స్కూలు ఫస్టు వచ్చాడు.

అప్పుడు రమేష్ దగ్గరకెళ్లి 'ఆ రోజు నువ్వు ఆన్సర్ పేపరు చూపించలేదు. ఇప్పుడు చూశావా? నేనే కష్టపడి చదివాను. ఫస్టు క్లాసులో పాసయ్యాను. నిన్ను మాత్రం సహాయ గుణం కలవాడివని ఎందుకంటారో ఇప్పటికీ అర్థంకావడంలేదు' అన్నాడు హేళనగా సురేంద్ర.

రమేష్ చిన్నగా నవ్వి 'సురేంద్రా! ఆ రోజు నీకు ఆన్సర్ పేపరు చూపించి వుంటే నీకు చదువుమీద ఇంత శ్రద్ధ పెరిగేది కాదు. కాపీలు రాయవచ్చని చదువును అశ్రద్ధ చేసేవాడివి. ఇప్పుడు నువ్వు టెన్త్ క్లాస్ తప్పేవాడివి. నీకు ఆ రోజు ఆన్సర్ పేపర్లు చూపించ కుండానే నిజమైన సహాయం చేశాను. అర్థం చేసుకో. ఏదేమైనా నువ్వు ఫస్టు క్లాసులో పాసైనందుకు అభినందనలు' అనేసి వెళ్లిపోయాడు.



క్విజ్ 84కి జవాబులు

1. లతా మంగేష్కర్ 2. ఒంటె 3. నేతాజీ 4. లియొనార్డో డావిన్సీ 5. రవీంద్రనాథ్ ఠాగూర్ 6. తిరువనంతపురం 7. శాస్త్రవేత్త 8. సెల్సియస్ 9. మెగస్తనీస్ 10. బాపు

క్విజ్ 83కి సరైన సమాధానాలు రాసిన వారు :

వై.నాగమణి, విఠంరాజువల్లె, గుంటూరు. **కాకుమాను సాయిలక్ష్మి,** 9వ తరగతి, ఎస్.ఎ.ఆర్.ఆర్.ఎమ్.హెచ్.స్కూల్, చీరాల. **ఎన్.పావని,** 4వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం. **జె.గాయత్రి,** 10వ తరగతి, **యు.యు.బాబు నరేంద్రప్రసాద్,** 6వ తరగతి, శ్రీ వేణు విద్యాలయం, ఎమ్మిగనూరు. **పంకజం . జి,** 9వ తరగతి, త్రిగుల్, మెదక్.



ఒకరా! ఇద్దరా!!

హాయ్! గతవారం మేజిక్ చేశారా! మీ స్నేహితులకు కూడా చేసి చూపించారా? ఏమన్నారు? నాకు తెలుసు. మిమ్మల్ని అభినందించి వుంటారని. సరే ఈ వారం కూడా మరో తమాషా మేజిక్ చెప్పకుందాం. కింద ఒక అమ్మాయి బొమ్మ వుంది చూశారుగా. చక్కగా తలంటి స్నానం చేసి జుట్టు విరబోసుకుని నవ్వుతోంది. ఆ బొమ్మను బాగా చూడండి. చూశారా? ఇప్పుడు చెప్పండి. బొమ్మలో వున్నది ఒక అమ్మాయా? ఇద్దరు అమ్మాయిలా? 'ఆ... ఎంత చూసినా మాకు ఒక అమ్మాయిలాగే కనిపిస్తోందే. కాకపోతే కుడికన్నే అదోలా వుంది' అంటున్నారు కొందరు చిన్నారులు. సరే. ఇప్పుడు నేను ఒక మంత్రం చెపుతాను. అక్షరంకూడా వదలకుండా అనండి. రెడీనా...'అబ్రకదబ్రా...అబ్రకదబ్రా... ఒక అమ్మాయి ఇద్దరు అమ్మాయిలు కావాలి దబ్రా. అబ్రకదబ్రా... అబ్రకదబ్రా...'. ఈ మంత్రం చదివి ఆ అమ్మాయి ముక్కుమీద అరచేతిని నిలువుగా పెట్టి చూడండి. ఎలా కనిపించింది? ఒక అమ్మాయి మన ఎదురుగా నిలబడి చూస్తున్నట్టు, మరో అమ్మాయి పక్కనుంచి చూస్తున్నట్టు కనిపిస్తోందికదూ. మరి అదే మేజిక్ అంటే. మీకు ఓ రహస్యం చెప్పనా. ఈ గొప్పతనం అంతా మన మంత్రంలో లేదు. ఈ బొమ్మ వేసిన చిత్రకారుని కుంచెలో వుంది. కావాలంటే మంత్రం చదవకుండానే .... బొమ్మ ముక్కుమీద అరచేతిని నిలువుగా పెట్టి చూడండి. ఎలా కనిపించింది. ఇద్దరు అమ్మాయిల్లాగానేనా? మరి అదే మన కంటిని మనమే నమ్మలేకపోవడం అంటే. అకస్మాత్తుగా చూస్తే ఆ ఫొటోలో వున్నది ఒక్క అమ్మాయేననిపిస్తుంది. కాస్త పరిశీలనగా చూస్తే ఇద్దరు అమ్మాయిల్లా కనిపిస్తారు. మరి వచ్చేవారం మరో మేజిక్ చెప్పకుందాం.

కలం స్నేహం



పేరు: వై.మదుసూదన్ రెడ్డి,
వయసు : 14 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు చదవడం, క్రికెట్ ఆడడం, కథల పుస్తకాలు చదవడం, చెస్ ఆడడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : వై.మదుసూదన్ రెడ్డి, 9వ తరగతి, ప్రగతి హైస్కూల్, పలిగొండ, నల్లగొండ.

పేరు: పడాల శ్రీలత,
వయసు : 13సం॥
చదువు : 8వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి పేపరు, దీపిక చదవడం, తమ్ముళ్లతో ఆడుకోవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : పడాల శ్రీలత, డాటరాఫ్ వి.సాంబమూర్తి, మల్లిఖార్జునకాలనీ, రాజాం.

ఇది పంది కాదు

ఈ టాపిర్ చూడటానికి పందిలా కనిపిస్తుంది. కానీ ఇది గుర్రం జాతికి చెందినది. దీని ముక్కు చిన్న తొండంలా ముందుకు సాగి వుంటుంది. ఇవి అడవులలో, నీటికి దగ్గరగా ఉంటాయి. ఇవి పూర్తి శాఖాహారులు. అమెరికా, మలయా ప్రాంతాలలో ఎక్కువగా కనిపించే టాపిర్లను మాంసం కోసం వేటాడతారు. వీటి చర్మం కూడా రకరకాల వస్తువులు చెయ్యడానికి ఉపయోగపడుతుంది. అందుకే వీటి సంఖ్య తగ్గిపోతోంది.



చిన్నారి చిత్రకారులు



ఎం.నందిని, 7వ తరగతి, ఏన్కూర్, ఖమ్మం.



పి.సతీష్‌కుమార్, 6వ తరగతి, బిఐటి స్కూల్, కాశీబుగ్గ.



ఎం.గురునాథ్‌రావు, 5వ తరగతి, గొంతివానిపాలెం, విశాఖ.

టి.వంశీకృష్ణ, 7వ తరగతి, ప్రగతి బాల విద్యాలయం, సుందరయ్య నగర్, తాడేపల్లి.

క్విజ్-85

1. కంటిని దానం చేసిన వ్యక్తినుంచి ఏ భాగాన్ని తొలగించి భద్రపరుస్తారు?
   ఎ. శుక్లము బి. కనుగుడ్డు
2. 'సారే జహాసే అచ్ఛా' గీతాన్ని రాసినదెవరు?
   ఎ. మహమ్మద్ ఇగ్బాల్ బి. ప్రేమ్‌చంద్
3. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటారు?
   ఎ.డిసెంబర్ 5 బి. డిసెంబర్ 10
4. ఇంగ్లీషులో ఎక్కువగా వాడే పదం ఏది?
   ఎ. ది బి. నో
5. 'ఎంకి' పాత్రను సృష్టించినదెవరు?
   ఎ. నండూరి సుబ్బారావు బి. పింగళి వెంకయ్య
6. మిక్కీ మౌస్‌ను రూపొందించినదెవరు?
   ఎ. వాల్ట్ డిస్నీ బి. రాబిన్స్
7. మహాకవి ఎవరు?
   ఎ. శ్రీశ్రీ బి. ఆరుద్ర
8. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద బహుళార్థ సాధక ప్రాజెక్ట్ ఏది?
   ఎ.నాగార్జునసాగర్
   బి. కాటన్ బ్యారేజి
9. మదర్ థెరిస్సా ఏ దేశంలో జన్మించారు?
   ఎ.యుగోస్లావియా
   బి. అల్జీరియా
10. ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?
   ఎ.ఆశాపరేఖ్ బి.హేమమాలిని

గుడ్డివారు

అక్బర్-బీర్బల్ కథలు

అక్బరు చక్రవర్తి ఓ రోజు దర్బారులో ఒక ప్రశ్న వేశారు. అదేమిటంటే 'మన పట్టణంలో గుడ్డివారు ఎక్కువా? లేక మంచివారు ఎక్కువా?' అని.

ఈ ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పలేకపోయారు. చక్రవర్తి బీర్బల్‌ను చూచి 'మీరు కూడా చెప్పలేరా?' అని ప్రశ్నించాడు. బీర్బల్ లేచి 'ప్రభూ! మన పట్టణంలోనే కాదు. లోకములో చాలా మంది గుడ్డివారున్నారు. అట్టివారిని ఇప్పుడే చూపించాలంటే కుదరదు. రెండు రోజులు గడువు ఇస్తే చూపించగలను' అన్నాడు. చక్రవర్తి గడువు ఇచ్చారు.

బీర్బల్ ఆ మరునాడు పట్టణంలో జనసంచారం ఎక్కువగా వున్న కూడలిలో కూర్చున్నాడు. చిన్న పాదరక్షల దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. ఓ జత చెప్పులు కుడుతూ కూర్చున్నాడు.

ఆయన చేస్తున్న పనిని చూస్తూ 'పండిట్‌జీ! ఏమి చేస్తున్నారు మీరు?' అని అడుగుతున్నారు. అటువంటివారి పేర్లను బీర్బల్‌చే నియమించపడిన ఓ వ్యక్తి పక్కనే కూర్చుని రాసుకుంటున్నాడు.

సాయంకాలమైంది. చక్రవర్తి విహారార్థం బయలుదేరి క్రమంగా అక్కడికి వచ్చారు. బీర్బల్‌ను చూచి ఆయన కూడా అదే ప్రశ్న వేశారు. బీర్బల్ లిస్టులో చక్రవర్తి పేరూ చేరింది.

ఆ మరునాడు మామూలుగా బీర్బల్ దర్బారుకు చేరుకున్నాడు. కొంతసేపయ్యాక, బీర్బల్ లేచి 'ప్రభూ! ఈ జాబితా చూడండి. వీరంతా మన పట్టణంలో వున్న గుడ్డివారు' అని ఒక కాగితాన్ని చక్రవర్తికి అందించాడు. అందులో చక్రవర్తి పేరు కూడా వుంది. ఇదేమిటి? మా పేరు కూడా వుందే!' అని ఆశ్చర్యపోయాడు చక్రవర్తి.

బీర్బల్ చేతులు జోడించి 'ప్రభూ! అందరూ నేను చేస్తున్న పనిని చూశారు. కాని 'ఏమి చేస్తున్నారు?' అని అడుగుతూ వెళ్లారు. చివరకు ప్రభువుల వారు కూడా. ఇలాంటివారంతా గుడ్డివారే కదా ప్రభూ. అంతేకాదు. కళ్లుండి కూడా గుడ్డివారు' అన్నాడు. బీర్బల్ తెలివికి పాదుషా ఆనందించి గొప్పగా సత్కరించారు.

చుక్కలు కలపండి!

✻ జి.శ్రీనివాసులు

ఒక చిన్న పూరిగుడిసె... దాంట్లోనే అమ్మ, నాయన, తమ్ముళ్ళు, నేను... తినేదానికి తిండి ఉండేది కాదు... ఒంటిమీద సరైన గుడ్డ చూసెరగము... పొద్దున్నే అడవికి పోయి కట్టెలు కొట్టి తేవాల్సిందే... అవి కూడా మోపు రెండు రూపాయలకు జి.కె.రాచపల్లె, మడితాడు, సుండుపల్లెలకు వెళ్లి అమ్మాల్సి వచ్చేది... అంత దూరం నెత్తిమీద పెట్టుకోని మోసే వాళ్ళం... కట్టెలు అమ్ముడుపోని రోజు బువ్వ ఉండదు... పస్తే... ఎకరా, అర్ధెకరానో మడి ఉన్నా డబ్బులు లేక సాగుచేసేటోళ్ళం కాదు... అందరూ చేలల్లో వేరుశనగ సాగుచేస్తే స్థోమత లేక సజ్జ ఏసేటోళ్ళం...దానికి తోడు వర్షాలు సక్రమంగా పడేవి కావు... ఎటు చూసినా కరువు... ఎక్కడ చూసినా ఎండిపోయిన చెట్లు, బీడు పడిన పొలాలు కనిపించేవి...కూలికి పోదామన్నా పనులు ఉండేవి కావు.. బతికేది కష్టం.. గవర్నమెంటోళ్ళూ సాయం చేయరు...చావంటే భయం.. ఇట్లాంటి స్థితిలో ఒకే మార్గం తోచింది... ధైర్యంగా అప్పు చేసి కువైట్‌కు పోయా..!

దూరపు కొండలు


తల్లిదండ్రులతో క్రిష్టానాయక్.

కడప జిల్లా సుండుపల్లె మండలం వానరాచుపల్లె బిడికికి చెందిన బుక్కే క్రిష్టానాయక్ జీవన చిత్రాన్ని కరువు శాసించింది. బతుకు తెరువుకు ఉన్న ఊరునే కాదు జిల్లా...రాష్ట్రం...దేశ....సరిహద్దులనే దాటించింది.

క్రిష్టానాయక్ లాంటి వారు దేశంలోనూ మన రాష్ట్రంలోనూ లక్షల సంఖ్యలోనే ఉన్నారు. పల్లెల్లో బతుక లేక ఉన్నవూరిని, కన్నతల్లిని, కట్టుకున్న భార్యను, కన్నబిడ్డలను వదిలేసి వేల మైళ్ళ దూర తీరాలకు వెళుతున్నారు. అక్కడ బాగా ఉంటే ఇంటికి డబ్బు పంపిస్తున్నారు. పంపించిన బ్రోకర్లు మోసం చేస్తే జైళ్ళలో మగ్గుతున్నవారూ, వెళ్ళిన వెంటనే తిరిగొచ్చేవారూ ఉన్నారు. పల్లెల్ని వదిలి దూర దేశాలకు పనులకు వెళ్ళే బడుగు జీవుల బతుకుల చీకటి వెలుగులివి......

వంద ఇళ్ళున్న ఆ వూరి నుండి 1994 సంవత్సరంలో మొట్టమొదట క్రిష్టానాయక్ కువైట్ వెళ్లాడు. ఆ తరువాత అదేవూరి నుండి దాదాపు 20మంది కువైట్‌కు వెళ్ళారు. క్రిష్టానాయక్ తమ్ముడు, అక్క భీమినితో సహా దాదాపు 18మంది స్త్రీలు కూడా అక్కడికే వెళ్లారు. ఈ సంవత్సరం ఆరంభంలో తిరిగి సొంతూరికి వచ్చిన క్రిష్టానాయక్ మాటల్లోనే ఆ పల్లెలో నేటి పరిస్థితి.

"కువైట్‌కు పోకముందు పల్లెలో అందరి పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. అందరివీ పూరిగుడిసెలే. ప్రస్తుతం చాలామంది పరిస్థితి మెరుగైంది. పక్కా గృహాలు నిర్మించుకున్నాము. కడప జిల్లా సంబేపల్లె మండలం పెద్దబిడికి, చిన్నబిడికిలకు చెందిన కొందరు ముంబయి, పూణే రెడ్ లైట్ ఏరియాలకు వెళ్ళి ఎయిడ్స్‌తో మరణించడంతో మా ఊరి స్త్రీలు ఆ నగరాలకు పనుల కోసం వెళ్ళలేదు. పొరుగు ప్రాంతాలకు వెళ్ళాలనుకున్నవారంతా నన్ను చూసినతర్వాత ఆడ, మగా అందరూ కువైట్‌కే వచ్చారు. కువైట్ వెళ్ళివస్తున్నవారి వల్ల ప్రస్తుతం మా పల్లె బాగా మారిపోయింది. మా చిన్నతనంలో మమ్మల్ని బడికే పంపేవాళ్ళు కాదు. చదువుకోడానికి వెళ్తే తిండికి జరగదని భయం. ఇపుడు ఆ పరిస్థితి మారింది. పిల్లలందరూ బడికి, ప్రయివేటు స్కూళ్ళకు వెళుతున్నారు. అయితే ఇప్పటికీ సరైన వైద్య సదుపాయం మాత్రం లేదు. అత్యవసరంగా ఆసుపత్రికి పోవాలంటే ఏడు కిలోమీటర్ల దూరంలోని సుండుపల్లెకు పోవాల్సిందే. నానికమ్మ అనే మహిళ సంవత్సరం క్రితం సరైన వైద్యం అందక మృతి చెందింది. ఇదీ మా పల్లె పరిస్థితి".

నేను మళ్ళీ కువైట్‌కే వెళ్ళాలనుకుంటున్నాను. అక్కడ సొంతంగా ట్యాక్సీ నడుపుకుంటాను. కనీసం ఎంత తక్కువైనా నెలకు పదివేల రూపాయలు సంపాదించేవాడిని. ఇక్కడ వానలు లేవు.. పంటలు పండవు.. ఇక్కడ తిండికే జరగదు. అందుకే తిరిగి అక్కడకే వెళ్ళాలనుకుంటున్నా...."

ఇది ఒక క్రిష్టానాయక్ కథే కాదు... ఇటువంటి వాళ్ళు సుండుపల్లె మండలంలో చాలామంది కనపడతారు. వర్షాలు సరిగా లేక పంటలు పండక పోవడంతో దాదాపు పది సంవత్సరాల నుంచి బతుకుతెరువుకు కువైట్‌కు వెళ్ళేవారి సంఖ్య పెరుగుతోంది. సుండుపల్లె, బుర్రలదిన్నె పల్లె, చెరువుకిందపల్లె, ఉప్పరపల్లె, వానరాచపల్లె, ఎగువబిడికి, కొలిమిమిట్ట, చిన్నగొల్లపల్లె, పెద్దగొల్లపల్లె, సానిపాయి, రాయవరం, పింఛా, కురవపల్లె తదితర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో పొట్టచేతపట్టుకుని కువైట్‌కు వెళ్ళారు. అలా వెళ్ళి అంతో ఇంతో సంపాదించుకున్న వాళ్ళు కొందరైతే... అక్కడ కూడా కష్టాలు పడి జైళ్ళపాలై ఇండియాకు చేరిన వాళ్ళు మరికొందరు...

కువైట్‌కెళ్లి మోసపోయాను.....

పంటలు పండక అప్పుల పాలైనాం... ఏదో కువైట్ కన్నా పోతే బాగుపడతామనుకున్నాం.. కాలుబయట పెట్టాల్సిన పనిలేదు.. అంతా ఇంట్లోనే పనని ఏజంట్ చెప్పాడు.. దీంతో 40వేలు పెట్టి వీసా కొన్నాం.. తీరా కువైట్‌కు పోతే తెల్సింది మోసపోయామని... కానీ ఏం చేస్తాం.. ఇక్కడికొస్తే అప్పులు అందుకే మొండిగా అక్కడే ఉండాలనుకున్నా.. కానీ సాధ్యం కాలేదు.. నకిలీ వీసా



పూరిగుడిసెల స్థానంలో పక్కా గృహాలు

అని పోలీసులు జైళ్ళలో పెట్టారు.. ఎట్లో కష్టాలు పడి ఇంటికొచ్చినట్టు వానరాచపల్లెకు చెందిన ఒక మహిళ ఆవేదన. తనలాంటి వాళ్ళు కువైట్‌లో పదుల సంఖ్యలో ఉన్నట్టు ఆమె చెబుతోంది. ఇలాగే చెరువుకింద పల్లెకు చెందిన ఒక వ్యక్తి కూడా కువైట్ వెళ్ళి మోసపోయాడు. తోటలకు నీళ్ళు పోసే పనని చెప్పి అక్కడ ఎడారిలో గొర్రెల దగ్గర కాపరిగా వేయడంతో ఇండియాకు వచ్చేశాడు. దూరపుకొండలు నునుపన్నట్టు దేశం కానీ దేశం వెళ్ళి కష్టాలు పడుతున్న వారి గురించి తెలిసి కూడా ఇక్కడ బతుకులేక కువైట్‌కు వెళ్ళే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతూనే ఉంది.

సొంత వూర్లో పంటల్లేవు.. ప్రభుత్వం ఏమీ సాయం చేయదు.. పని లేదు, తిండి లేదు, బతికేమార్గం లేదు.... జానెడు పొట్ట నింపుకోవడానికి ఇన్ని కష్టాలు పడుతున్న పల్లె ప్రజలు కష్టపడటం తప్పనవుడు ఏ దేశమైతే ఏమవుతుందని అనుకుంటున్నారు... వారిని ప్రకృతి, ప్రభుత్వం, ఆఖరుకు విదేశాలకు పంపిస్తామంటూ కొంతమంది ఘరానా మనుషులు మోసం చేస్తున్నారు. మోసపోయే వారినీ చూస్తున్నారు,.. మోసం చేసేవారినీ చూస్తున్నారు.. వారికి అక్షరం ముక్కరాదు. లోకం పోకడ తెలియదు.. గొర్రె కసాయివాడిని నమ్మినట్లు తెల్లచొక్కాలు వేసుకున్నవారిని నమ్ముతున్నారు.. ఉన్న పొలం పుట్రా అమ్మేసి, అయినకాడికి అప్పుచేసి ఏజెంట్లనబడే మోసగాళ్ళ చేతుల్లో పోస్తున్నారు. మోసపోతూనే ఉన్నారు.... ఇది కరువుచిత్రం, కరువు సృష్టిస్తున్న, శాసిస్తున్న పల్లె జీవనం... ●

(9వ పేజీ తరువాయి)

హైటెక్ కూలి

డిపార్టుమెంటుని పూర్తి అవపోసన పట్టిన తాను తన వైఖరిని మార్చుకోలేదు. ఆ వైఖరితోనే చాలా మంది అతడ్ని నాయకుడిగా అంగీకరిస్తారు.

'సార్ మీరు ఈ బిల్లులో క్లరికల్ మిస్టేక్సుని అడుగుతున్నారు. కానీ ఈ ఎస్డీవో గారు తన అక్కొంటులో మూడు ఓచర్ల ద్వారా రెండు వేలు ఖర్చు పెట్టినట్లు చూపెట్టాడు. ఆ ఖర్చు సురేష్‌కు చెందినదే. అతడికి వెయ్యిరూపాయలే ఇస్తున్నట్లు తెలిసింది. చిన్న స్టేషన్లలో నైట్‌వాచ్‌మెన్లకు ఎనిమిదొందలు ఇస్తున్నట్లుగా రాశాడు. కాని అయిదొందలే ఇస్తున్నాడు. సురేష్‌కు కంప్యూటర్ ప్రావీణ్యం ఉంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఏడెనిమిది గంట దాకా ఎస్డీవో సమస్తం తానే అయి చేస్తున్నాడు. అన్‌స్కిల్డ్ లేబర్‌కు యాభైరెండు, స్కిల్డ్‌కు వంద రూపాయల చొప్పున, హెడ్డాఫీసులో కంప్యూటర్ మీద చేస్తున్న వాళ్ళకు స్కిల్డు లేబర్‌గా భావించి రోజుకు వంద రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు" అని వివరించాడు రాంచంద్రం డి.ఈ.తో.

ఈ ప్రభాకర్ బట్టి లోఫర్. లేబర్ రక్తం పీలుస్తున్నాడు. నాకు కౌంటర్ సైన్ తప్ప మరేమి చేయడానికి లేదాయె. అయినా నా పరిధి మేరకు సురేష్‌కు న్యాయం జేస్తాను' అంటూ ఎస్.డి.ఓ. ప్రభాకర్‌కు అతడి ముందే ఫోన్ చేశాడు.

అతడి అభిప్రాయానికి స్పందించినందుకు డి.ఇ.కి కృతజ్ఞతలు తెలిపి ఛాంబర్ నుంచి బయటపడ్డాడు.

* * *

రాంచంద్రంకు తన కృతజ్ఞతలు తెలియజేసుకునేందుకు అతడ్ని ఇంటి వద్ద కలుసుకున్నాడు సురేష్.

"నువ్వు చేసే పనికి డ్రా చేస్తున్న వేతనం నీకు అందేలా చేశాను. కాని ఆ మొత్తం నీ శ్రమకు సగానికి కూడా సరిపోదు. అందుకని మీరు అంత తక్కువ వేతనాలకు పని చేయడం మానెయ్యాలి"

"మీరు చెప్తున్నది నిజమే సార్. గవర్నమెంటు ఆఫీసుల్లో అంతటా ఇదే స్థితి. మానేస్తే దూరిపోవడానికి ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు".

"అట్లాకాదు. కంప్యూటర్ ఆపరేట్ చేయడం వచ్చిన వాళ్ళంతా ఏకం కావాలి. పని ఉన్న వాళ్ళు, లేని వాళ్ళు అందరూ ఒక్కటవ్వాలి. నిర్దిష్టంగా రోజుకు ఇంత అయితేనే చేస్తాం అని చెప్పగలగాలి."

"మీరు చెప్పింది సబబుగానే ఉంది. ఆలోచిస్తా సార్'' అంటూ సురేష్ సెలవు తీసుకున్నాడు.

* * *

రెండు రోజుల్నుంచి సురేష్ ఆఫీసుకు రావడం లేదు. కంప్యూటర్ ద్వారా కావలసిన పనులు కాక జూనియర్ అధికార్లు చికాకు పడుతున్నారు. పై ఆఫీసుకు స్టేట్‌మెంట్లు వెళ్ళనందున ఎస్డీవో (ఎస్.డి.ఓ.) చివాట్లు పడ్డాయి. ఆ పట్టణంలో అన్ని ఆఫీసుల్లో అదే స్థితి.

మధ్యాహ్నం ఆఫీసు ముందు నుంచి మెయిన్ రోడ్డు మీదగా ఊరేగింపు సాగింది. యువజన సంఘం బ్యానర్లు ఉన్నాయి. అన్ని ఆఫీసుల్లో క్యాజువల్స్‌గా పని చేస్తున్న, నిరుద్యోగ యువకులు అందరూ ఆ ఊరేగింపులో కన్పించారు.

"ఆఫీసుల్లో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు మంజూరు చేయాలి."

'కంప్యూటర్లకు నూతన ఉద్యోగ నియామకాలు జరపాలి'.

'ప్రతిభకు, నైపుణ్యతకు తగు వేతనం ఇవ్వాలి.'

ఊరేగింపులో విన్పించిన ఈ నినాదాలు ప్రజల్ని బాగా ఆకర్షించాయి. 'పాపం పిల్లలు రోజూ కూలీల్లెక్క పనికి తిరుగుతున్నారంట' అంత సదువుకున్నా రోజుకు నలభై, యాభై రూపాయలేనంట అళ్ళకూలి, 'అళ్ళకన్నా మనమే నయమున్నట్లుంది' ఓ తాపీ కార్మికుడు తన అభిప్రాయం చెప్పాడు. ఆ చదువుకున్న నిరుద్యోగుల డిమాండ్లకు ప్రజల మద్దతు లభించింది. మిట్టమధ్యాహ్నం నిప్పులు చెరుగుతున్న సూర్యుడికున్న శక్తి ఆ యువకుల్లో కనిపిస్తోంది. తమ కోర్కెలు సాధించుకోగలమన్న విశ్వాసం వారిలో కనిపిస్తోంది. ●

* లక్ష్మి

పెళ్ళిరోజు గుర్తుందా?

ప్రేమ, పెళ్ళి - రెండూ రెండు చాప్టర్లు!

ప్రేమించే రోజుల్లో -

ఆ ప్రేమ తియ్యగా వుంటుంది. తిమ్మిరిగా వుంటుంది. గొప్ప కిక్కుగా ఉంటుంది. మాంచి మజాగా వుంటుంది.

పెళ్ళయిన తర్వాత -

ఆయా జాతకాలను బట్టి - మెల్లిమెల్లగా - ఆయొక్క తియ్యటి ప్రేమ చేదుగా వుంటుంది. మంటమంటగా వుంటుంది. తిక్కతిక్కగా వుంటుంది!

ఈ సూత్రం నాకు పెళ్ళి కాకముందు మంగతాయారు చెప్పింది. నా పెళ్ళికంటే దాని పెళ్ళి రెండేళ్ళ ముందే జరిగింది. వాళ్ళది ప్రేమ పెళ్ళి! ప్రేమించుకుని పెళ్ళి చేసుకున్నారు!

ఏ రకం పెళ్లయినా - చాలా పెళ్ళిళ్ళకు ఈ రూలు వర్తిస్తుందని సర్వే చేసి తెలుసుకున్నాను. వదిలేయండి!

ఈ భూలోకంలో ప్రేమికులెంత మంది వున్నారో నాకు తెలీదు. ప్రేమించే సీజను లక్షణాలు మాత్రం తెలుసు! ఆ సీజన్లో అతనికి ఆమె అప్సరస మాదిరి కనిపిస్తుంది. అపరంజి బొమ్మలాగా కనిపిస్తుంది!

అందువల్ల-

అతను నువ్వే నేనని పాటలు పాడతాడు. నేనే నువ్వని కవిత్వం చెబుతాడు. నీ ఎడబాటులో నిద్ర రాదంటాడు. ఆకలి చచ్చిపోతుందంటాడు. అతను అనడమే కాదు. యదార్థం కూడా అదే!

కన్నుమూసినా తెరిచినా ఆమె రూపమే కనిపిస్తుంది. ఆఫీసులోనూ అద్దెగదిలోనూ కూడా సుఖంగా వుండలేదు. ఆఫీసు ఫైళ్ళలో ఆమె నామకోటి రాసుకుంటూ వుంటాడు. అద్దె గది గోడ మీద ఆమె రూపు రేఖలు గీసుకుంటూ వుంటాడు!

అతని గదిలో దేవుడి కేలెండర్లుండవు. వుంటేగింటే దేవుడ్ని కప్పేసి - ఆ స్థానంలో ఆమె ఫొటో మాత్రమే వుంటుంది. కేలెండరు కాగితాలు బరువుగా చిరుగుతుంటాయి. ప్రేమా నీ పెళ్ళెప్పుడు అంటూ మాసిన గడ్డం నిమిరుకుంటూ అద్దంలో అడుగుతుంటాడు!

సంబంధాలు చూస్తున్నామని అమ్మానాన్నా విడివిడిగా ఉత్తరాలు రాస్తుంటారు. ఇప్పుడే నా పెళ్ళికేం తొందరని టెలిగ్రాం భాషలో కార్డుముక్క రాసిపారేస్తాడేగాని - గుండెల్లో కితకితలు పెట్టే కిన్నెర గురించి అక్షరం చెప్పడు!

ఆమె కనిపిస్తే చాలు గాల్లో తేలిపోతాడు. కనిపించకపోతే మాత్రం ప్రేమ వరదలో కొట్టుకుపోతాడు. ఎన్నో కలలు వస్తుంటాయి! అన్ని కలలూ టెక్నికలర్లో వుంటాయి!

కల నిజమైతే అని గొణుక్కుంటాడు. ఆ మాటే ఆమెకు చెప్తాడు. ఆమె నవ్వుతుంది. చిలిపిగా దోసిట పడతాడు. ఎందుకని ఆమె అడిగినప్పుడు - రత్నాలరత్నాలని ఎక్కాలు చదువుతాడు!

అతని ధోరణికి ఆమె సంతోషిస్తుంది! ఇతడే నా జతగాడైతే నా జీవితం ధన్యమవుతుందని ఆశిస్తుంది! కాలు కింద పెట్టనివ్వనీడని తలపోస్తుంది. ఇంత గొడవ జరిగేక - రెండు కుటుంబాల్లో అశాంతి తొలిగేక - ఇద్దరికీ పెళ్ళవుతుంది! రెండు మూడేళ్ళపాటు ఆ సంసారం తిమ్మిరి తిమ్మిరిగానే సాగుతుంది. పిల్లలు పుడతారు!

అప్పుడు ప్రారంభమవుతుంది రెండో దశ!

అది ఆగస్టు పధ్నాలుగు! ఆ ప్రేమికులకు పెళ్ళయిన రోజు! అతను ఆ రోజు పూర్తిగా మరిచిపోయి రెండేళ్ళు గడిచేయి! ఇప్పుడతనికి పేకాట్లో తనని ఏ కార్డు ఎప్పుడు దెబ్బతీసిందో గుర్తు! ఏ రోజు బాసు తనని తిట్టేడో లేక మెచ్చుకున్నాడో గుర్తు! ఏ కొలీగు ఎప్పుడు చెయ్యిచ్చేడో బాగాగుర్తు!

ఇంకా చెప్పాలంటే -

ఆఫీసుకి సెలవలు ఎప్పుడెప్పుడొస్తాయో సులువుగా చెప్పగలడు. ఇంక్రిమెంట్ల తేదీలు చెప్పగలడు. అప్పారావు తనక్కనిపించి ఎన్నాళ్ళయ్యిందో కరెక్టుగా చెప్పగలడు. ఇన్ని చెప్పగలిగిన మనిషికి - తన పెళ్ళి ఏ తేదీన జరిగిందో కనీసం ఏ సంవత్సరం జరిగిందో మాత్రం చెప్పలేడు! ఆ రోజు ఈ రోజే గనక - ఈ రోజుని శ్రీవారు ఎంత జ్ఞాపకం పెట్టుకున్నారో తెలుసుకుందామని శ్రీమతి అట్నుంచి నరుక్కుంటూ వస్తుంది. ఆ సమయంలో అతను అద్దమ్ముందు ముస్తాబవుతూ వుంటాడు!

ఇవాళైనా తొందరగా ఇంటికి రండి అంటుందామె. ఓయస్సలాగే అంటాడతను - అతి మామూలుగా పరమ రొటీనుగా. అంతేగాని ఈ రోజు ప్రత్యేకత ఏమిటని అడగడు. ఎందుకో తెలుసా అని ఆ ఇల్లాలే అడుగుతుంది. సినీమా ప్రోగ్రామే కదా అంటాడతను చాలా ఈజీగా. ఆ సమాధానం విని నీరు కారి పోతుంది అర్ధాంగి. ఈ మానవుడికి సమస్తమైన విషయాలూ జ్ఞాపకముండి పెళ్ళిరోజు మాత్రమే మరిచిపోయే దరిద్రగొట్టు గుణమెందుకిచ్చేవు భగవంతుడా అని లోలోన గొణుక్కుంటుంది!

ఏదో అన్నావల్లే వుంది అని అడుగుతాడతను. ఇవాళ ఆగస్టు పధ్నాలుగు అని లీడిస్తుందామె! మాకూ తెలుసంటాడతను. రేపు ఆగస్టు పదిహేను అంటాడు. ఆఫీసుకి సెలవంటాడు. అయినా బాసు ఆఫీసుకి తగలడమని ఆర్డరు వేసేడు గనక వెళ్ళక తప్పదంటాడు. ఆ రైలు ఇంక ఆగదని గ్రహించిన ఆ అతివ - మూడేళ్ళ క్రితం ఆగస్టు పధ్నాలుగున ఏం జరిగిందో అప్పుడే మరిచిపోయేరా అని ఆరా తీస్తుంది. ఎందుకు మరిచిపోతాను అంటాడు. ఆ రోజు ఆదివారం అంటాడు. ఆ తర్వాత సోమవారం అంటాడు. సోమవారం ఆగస్టు పదిహేను కావడం వల్ల ఆ రోజు కూడా సెలవే అంటాడు. వరసగా రెండు రోజులూ సెలవలొచ్చేయంటాడు!

మూడేళ్ళ క్రితం ఆఫీసు సెలవల్ని అంత భద్రంగా గుర్తు పెట్టుకున్న భర్త మహాశయుడు - ఆగస్టు పధ్నాలుగు ప్రాముఖ్యతను ఎందుకు మరిచిపోయేడో తెలీక అల్లాడిపోతుంది ఇల్లాలు! తప్పనిసరై చెబుతుంది. అది తమ పెళ్ళిరోజని! అంతమాట విని - ఆ మాట తనకి గుర్తుకు రానందుకు ఏ మాత్రం సిగ్గుపడకుండా - ఓసంతేగదా అని సింపులుగా తీసిపారేస్తాడు! అనేకమైన విషయాలు -తేదీలు వారాలతో సహా గుర్తు పెట్టుకుని - తమ పెళ్ళిరోజు గాలికొదిలేయడం భర్త మారాజుకే చెల్లు! అది అతని ప్రత్యేకత! ●

❊ రుక్మిణి



అలీబాబు - అంగామా

అలీబాబు తెగ దిగులు పడిపోతున్నాడు. తల దిమ్ముగా వుంది. అవతల చూస్తే బోల్డన్ని సమస్యలు. అసలు తన 'రాజ్యం'లో ప్రజలకు తన పాలన పట్ల మొహం మొత్తినట్లుంది! కాదు... విరక్తి... ఏవగింపులు కూడా పుట్టుకొస్తున్నట్లుంది. వేగులవారి పరిశీలనా... రహస్య సర్వేలు కూడా దీన్ని బలపరుస్తూనే వున్నాయి.

ఎక్కడుంది లోపం ?

నిత్యం జనాలను గుంపులు గుంపులుగా చేసి వివిధ పథకాలనీ... ప్రయోజనాలనీ... 'బంగారం పూత' పూసిన రాజ్యంగా తయారు చేసి, పదిలంగా మీకు అప్పగించేస్తాననీ వూదర కొడుతూనే వున్నాడాయె! ఖర్మ... అదంతా వుత్తుత్తి ఊదరే అనిగానీ జనాలు గ్రహించి పారేశారా... అంతే కావచ్చు.. ఎంతైనా జనం తెలివిమీరిపోతున్నారు. ప్రమాదం!

అట్లాంటి 'ప్రమాదం' రాగూడదనే జనాలకు గ్రామగ్రామాన... వీధి వీధినా... చివరికి ఇంటింటికీ 'మద్యం' సరఫరా కూడా బాగా అందుబాటులోకి తెచ్చాను గదా... ఆ మద్యం మత్తులో జనాలు తెలివి మీరకుండా... తెప్పరిల్లకుండా పొద్దస్తమానం దాని యావలోనే పడిపోవాలి గదా... మరిట్లా అయిందేం?

అలీబాబు ఆంతరంగికుడైన మంత్రిని పిలిపించాడు ...."ఇదీ విషయం! ఈ ప్రమాదం నుండి బయటపడే వుపాయం ఆలోచించకపోతే మన పదవులు వూడి... పరారు కావలసి వస్తుంది!"

ఆశలు, అద్భుతాలను చూపించి నెట్టుకొచ్చాం - అవన్నీ వుత్త సొల్లు కూతలని వాళ్ళు గ్రహించినారు. కాబట్టి వారికి తక్షణమే అవసరపడు... అందుబాటులోకి వచ్చు ప్రయోజనాలు అందించే రకరకాల పథకములను ప్రకటించి అమలు జెయ్యాలె!

బా! : ఏకంగా అమలు చేసినచో మన విదేశీ ఒప్పందములు... షరతుల సంగతి...

మం! - మన అడుగు వూడకుండా వున్నంతలో వరాల జల్లు కురిపించి ఈ గండం దాటుదాం. నోటికి ఏదివొస్తే అది... 'ఇస్తా'మని హడావుడి చెయ్యాలె!

బా! : ఇవ్వడానికి మన్దెవులుబాటు...

మం! : అంతామాయ... భ్రమ... మీరు మరిచినట్లున్నారు. చీకటి గూట్లో నుండి అద్భుత దీపాన్ని బయటకు తీయండి - రుద్దండి! భూతం బయటకు వస్తుంది... ఇంకా అంతా వెలుగే వెలుగు... పెరిగిపోతున్న దరిద్రాన్ని సమ్మోహన పరిచి మాయలో ముంచే మార్గం!

వెంటనే అలీబాబు తన మరుపును తానే నిందించుకుని, వడివడిగా తన సామానుగదిలోకి ప్రవేశించి, గూట్లోని అద్భుత దీపాన్ని బయటకు తీశాడు. ఆబగా బరబర దాన్ని రుద్దగానే... వెలుగులు చిమ్ముతూ భూతం అట్టహాసంగా బయటకు వచ్చి వినయంగా చేతులు కట్టుకుని "మహాప్రభో... శాన్రోజులకు ఈ సేవకుడ్ని పిలిపిచ్చినారు. నేను గా దీపంలో ఇన్నాండ్లు ముడుసుకుని పండుకుని... ఉత్త వుల్పట్‌గా మారిపోతిని. పని పాటల్లేక పాయె - ఏంటీ మీ ఆర్డరు - జరజెప్పుండ్రి...

అలీబాబుకు అమిత సంతోషం వేసింది. "ఏంలేదు భూతమా... జనాలు వూరికే అలజడిపడి అసహనంగా మనమీద కారాలు మిరియాలు నూరుతున్నారని వేగులవారి రిపోర్టు. వెంటనే జనాలందరికీ లక్షలు... లక్షల రేషను కార్డులు పంచాలె - అదీ ఒక రాత్రి లోపే జరిగి పోవాలె... ఎట్లా చేస్తావో అంతా నీ ఇష్టం...!" అని మూలిగాడు.

భూతం జాలిగా నవ్వింది. "బోగసు కారట్లని నువ్వే వూడబీకితివి. సరె... ఇప్పటికి ఎట్లనో జనాల్ని మేనేజ్ చేస్త...!" అని వెంటనే మాయమయ్యింది. అలీబాబు చంకలు గుద్దుకున్నాడు. క్షణంలో భూతం తిరిగి వచ్చింది.

"భూతం భాయ్... నువాపని... ప్రజలకు మరుగుదొడ్ల మీద మక్కువ... ఒక కుటుంబానికో మరుగుదొడ్డి... ఈ వరం బాగా పని చేస్తుందని తెలియజేసుకుంటున్నాను.

"ఓకెబాస్" భూతం వెంటనే మాయమయ్యింది. అలీబాబు చంకలు గుద్దుకున్నాడు. తర్వాత తిరిగి వచ్చిన భూతంతో ఆడపిల్లలకు సైకిళ్ళూ... ఇండ్లులేని పేదలకు పట్టాలు... పట్టీలు... వృత్తిదారులకు యూనిట్ల వారీగా రకరకాల పథకాలు... అన్నటికీ భూతం 'జీహుజూర్' అని వురుకుల్తో మాయం గావడం... తిరిగి ప్రత్యక్షం కావడం చూసి అలీబాబు ఆనందంతో చంకలు మంటపుట్టేదాకా చరుచుకున్నాడు.

"అబ్బ బాసూ... జనం భయపడి కళపెళ పడిపోతండ్రు... కొత్తాయె - గివన్ని పూరాగా అందుబాటులోకి వచ్చేసరికి ఇంకేం అక్కర్లేదని... మురిసిపోతున్నారు - నాకేమో అలసట.. ఓవర్ టైం కూడా చేస్తిని (అని ఆవలించాడు) కాస్తంత గింత కునుకు గిన తీస్తినా...

"చత్... అట్లెట్ల.. నేన్రోజుకు పద్దెనిమిది గంటలు... హన్నా... మరోమాట - అనేంతలో భూతం చిరుబురులాడి "సార్... మీకో చిక్కొచ్చిపడింది" అనంగానే అలీబాబు బిత్తరపోయాడు.

"ఏంటంటే - మందేశంలో కోటిమంది పేదలే వున్నారని మీరనుకుంటున్నారు. కాని తీరా నేను నా 'పవర్ మాయ' నుపయోగిచ్చి చూద్దును గదా వాండ్ల సంఖ్య మీ అంచనాలను మించిపోయింది. పది లక్షల నుండి పాతిక... ఇపుడు యాభై లక్షల దాకా దరిద్రులకు నేను కారుట్లు ఇయ్యాల్సి వస్తుంది సార్... కాసుకోండి"

అలీబాబు అసహనంతో చిందులు తొక్కాడు.

"మరేదీ కరువు-దరిద్రం అని గోల పెడితే కేంద్రం నుండి బృందం పరిశీలనకు వచ్చిందా. మీరంతకుముందు మన దేశం అటు ఆటల్లో.. ఇటు హైటెక్కులో... అటు ఫ్లైఓవర్లలో ఇటు బ్రిడ్జిల కింద ఫ్లైవర్లలో ఇటు దేశంలో... అటు ప్రపంచంలో అంతా అభివృద్ధేనని... ముందుకు ముందుకే నూక్కుంట పోతున్నమని గప్పాలు వాయించితిరి - వాండ్లు మరింక 'మా పరిశీలనే అక్కర్లేదూ... మీ మాటే వేదవాక్కూ... అందరూ. మీ మాటమీద ఆధారపడి సాయం అంటే మీ పని గోవిందా... ఎందుకంటే అంతటి అభివృద్ధేనాయె... స్వయం సహాయక బృందాలు... బిందుసేద్యం...

అలీబాబు అయోమయంలో పడ్డాడు. చెవట్లు తుడుచుకుని "సర్సరె... నువ్వైతే అంతా సరిజేసినావు గద్దా... చివరగా... కాస్తంత ఓపిక చేసుకుని ఈ 'అవినీతి'ని అంతం చేసి వెంటనే గబాల్న దీపంలో దూరిపోయి దుప్పటి కప్పుకో..." అనంగానే భూతం గజగజా వణికిపోయి హఠాత్తుగా నేలమీద సాగిలపడి అలీబాబు కాళ్ళందుకున్నాడు.

"మహాప్రభో... గా మాట జెప్పకండి సారో... మీ పాలనలో అది విశ్వరూపం ధరించింది. అదీగాక అది మీ నుండే మొదలయ్యిందాయె. నీ బాంచను అటు జనాల గోల.... ఈ 'బిగ్‌బాస్'... మూడొందల కోట్లు.. అబ్బో... ముడుపులందుకుంటున్న వారికి - అవినీతిపరుల్ని మీ పేషీ చక్రం అడ్డం వేసి రక్షించడం.. ఎన్నని... మహాప్రభో... మీ ఏ పచ్చచొక్కా బాబును చూసినా... తాకినా... అవినీతి కంపేనాయె...గబ్బు... అబ్బో... అది నా వల్లగాని పని... నీ కాల్మొక్తా... క్షమించండి..."

అట్లా అని భూతం రివ్వున దీపంలోకి జొరబడిపోయింది. అలీబాబు తీవ్రంగా ఆలోచనలో పడిపోయాడు! ●

* పి.దక్షిణామూర్తి

గుండెపోటు 30 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు వారిలో కూడా ఎక్కువగా వస్తున్నది. రక్తనాళాల గోడలలో కొవ్వు పదార్థాలు పేరుకోవడానికి (ఆర్టీరియో స్క్లీరోసిస్) దోహదం చేసే అంశాలైన మితిమీరి ఆహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం లేకపోవడం, పొగతాగడం మొదలైన అలవాట్లు 20 సంవత్సరాల వయస్సుకు ముందే ప్రారంభం అవుతాయి. తరువాత నిదానంగా 20 లేక 30 సంవత్సరాల పాటు ఈ కొవ్వు పదార్థాలు పేరుకోవడం కొనసాగి చివరకు కరోనరీ రక్తనాళాలలో రక్తప్రసారం తగ్గిన తరువాత గుండెపోటు లక్షణాలకు దారితీస్తుంది. కాబట్టి ప్రాథమిక నివారణ బాల్యంలోను, కౌమార దశలోను మాత్రమే ప్రారంభం కావాలి. 35 సంవత్సరాలు దాటాక, అప్పటికే (గుండెపోటు భవిష్యత్తులో రాబోయే వారికి) కొవ్వు పదార్థాలు పేరుకోవడం జరుగుతుంది. కాబట్టి అవి మరింత పెరగకుండాను, మిగతా రక్తనాళాల శాఖోపశాఖల్లో రక్తప్రసారం పెంపుదల చేయడానికి మనం కృషి చేయాలి.

గుండెపోటును నివారించడం ఎలా?

గుండెపోటుకు దోహదం చేసే వ్యాధుల్లో అధిక రక్తపోటు, మధుమేహం ముఖ్యమైనవి. ఆరోగ్యవంతుని రక్తపోటు సాధారణంగా 120/80 వుంటుంది. 140/90 దాటితే ఎక్కువగా వున్నట్టే. రక్తపోటు అధికంగా వున్న వారిలో చాలా మందిలో ఎలాంటి లక్షణాలు వుండకపోవచ్చు. నిశ్శబ్దంగా పెరిగి, హానిని కలిగించే ఈ వ్యాధిని తరచు డాక్టర్‌తో పరీక్ష చేయించుకోవడం ద్వారానే కనిపెట్టవచ్చు. ఆహార విహారాదులలో సంయమనం ద్వారా, మందుల ద్వారా రక్తపోటును అదుపులో పెట్టుకోవడం ముఖ్యం. అలాగే మధుమేహ వ్యాధి వున్న వారు ఆహార నియమాలు, ఇచ్చే ఔషధాలు లేదా ఇన్సులిన్ ద్వారా వ్యాధిని పూర్తిగా అదుపులో వుంచుకోవాలి. మూత్రంలో షుగర్, రక్తంలో షుగర్ తరచుగా పరీక్ష చేయించుకుంటూ డాక్టర్ సలహా ప్రకారం నడుచుకోవాలి.



మానవుడి హృదయం

రక్తంలో 'కొలెస్టరాల్', 'ట్రైగ్లిసరైడ్స్' అనే కొవ్వు పదార్థాలు ఎక్కువగా వుండడం కూడా గుండెపోటుకు దోహదం చేసే అంశాలలో ముఖ్యమైనవి. 100 సి.సి. రక్తంలో కొలెస్టరాల్ 150 మిల్లీగ్రాముల నుంచి 250 మిల్లీ గ్రాముల వరకు మామూలుగా వుండాలి. అంతకుమించి వుంటే వైద్యుని సలహాతో ఆహారంలో మార్పులు చేసి, అవసరమైతే ఔషధాలు వాడాలి. నెయ్యి, వెన్న, మీగడ, జున్ను, డాల్డా, కొబ్బరినూనె, కోడిగుడ్డులో పచ్చసొన, కాలేయం, వేటమాంసం, పందిమాంసం మొదలైన ఆహార పదార్థాలలో కొలెస్టరాల్ ఎక్కువగా వుంటుంది. ఇటువంటివి బాగా తగ్గించాలి. నువ్వుల నూనె, ఆవనూనె, పత్తిగింజల నూనె, పొద్దుతిరుగుడు పువ్వు నూనె) మొదలైన శాకతైలాలకు కొలెస్టరాల్ తగ్గించే స్వభావం వుంది. వీటిని కూడా మితంగానే రోజు మొత్తం మీద 2 లేక 3 టీ చెంచాల నూనెను మాత్రమే వంటలో ఉపయోగించాలి. కోడిమాంసం, చేపలు తినవచ్చు. వాటిని కూడా వేపుడు లేకుండా ఉడకబెట్టినవి వాడాలి. కొవ్వు పదార్థాలతో పాటు తీపి పదార్థాలను, పిండి పదార్థాలను కూడా చాలా మితంగా తీసుకోవాలి.

బరువు మితిమీరి వుండడం కూడా గుండెపోటుకు దోహదం చేసే అంశాలలో ఒకటి. ఒక వ్యక్తి 20 కిలోలు ఎక్కువ బరువు వున్నాడంటే, అతడు తన భుజాల మీద అరమణుగు బరువును మోస్తున్నాడన్నమాట. చిన్న వయస్సును మించి మితిమీరి భుజించే అలవాటును మానుకోవాలి. 'తక్కువ భుజించు - ఎక్కువ కాలం జీవించు' అనేది మంచి సూక్తి. కాయకష్టం చేయని వృత్తులలోని వారు (ఉద్యోగులు, వ్యాపారస్తులు,



లాయర్లు, డాక్టర్లు, గుమాస్తాలు వగైరా) ముఖ్యంగా మధ్యతరగతి, పై తరగతి ప్రజలు అవసరమైనదానికంటే ఎక్కువ కేలరీల ఆహారం తీసుకొంటున్నారు. వీరికి రోజుకు 1500 నుంచి 1800 కేలరీల ఆహారం సరిపోతుంది. అవసరమైనదానికంటే ఎక్కువ ఆహారం తీసుకుంటే అది కొవ్వుగా మారి పొట్టమీద పేరుకుంటుంది. మనం ఆరోగ్యంగా వుండాలంటే పొట్ట (బొడ్డు దగ్గర) చుట్టుకొలత ఛాతీ కొలత కంటే రెండు అంగుళాలు తక్కువ వుండాలి.

బరువు తగ్గాలంటే కేలరీలను ఎక్కువగా అందజేసే పిండి పదార్థాలను, కొవ్వు పదార్థాలను బాగా తగ్గించాలి. మాంసకృత్తులు (ప్రొటీనులు) మాత్రం రోజుకు 50 నుండి 70 గ్రాముల వరకు తీసుకోవాలి. కూరగాయలు తప్ప, మిగతా ఆహార పదార్థాలన్నింటినీ బాగా తగ్గించి తినాలి. ఎక్కువగా వరి అన్నం భుజించే మన దక్షిణ భారత దేశస్తులలో "అన్నంలో కూరలు కాకుండా కూరలలో అన్నం కలుపుకోవడం" అలవాటు చేసుకోవాలి. 18-21 సంవత్సరాల వయస్సులో మన బరువు ఎంత వుండేదో అంతే మనం వుండవలసిన బరువు. వారానికి ఒకటి నుంచి ఒకటిన్నర కిలోల బరువు తగ్గడం మంచి పద్ధతి. పూర్తిగా ఆహారం మానేసి త్వరత్వరగా బరువు తగ్గడం కూడా మంచిది కాదు. ప్రతివారం బరువు చూసుకొంటూ వుండాలి. బరువు తగ్గవలసినంత తగ్గాక, తగ్గిన బరువు అలాగే నిలుపుకోవడం మరింత ముఖ్యం. ఆహారం తగ్గించే మార్గాలలో ఒక పద్ధతి ఏమిటంటే తక్కువ నూనెతో వండిన కూరలను, ఆకు కూరలను మినహాయించి మిగతా ఆహారాన్ని అంతటినీ 25 నుండి 50 శాతం తగ్గించడం. ఉదాహరణకు రెండు చపాతీల బదులు ఒక చపాతీని, పాలు ఒక గ్లాసు బదులు అరగ్లాసు తీసుకోవాలి. రాత్రిపూట భోజనం మానివేయడం మంచిదేకాని, దాని బదులుగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఎక్కువ తినకుండా వుండాలి.

పొగతాగని వారిలో కంటే, పొగతాగే వారిలో రెండు నుంచి ఆరు రెట్లు అధికంగా గుండెపోటు వస్తుంది. పొగతాగడం వల్ల కరోనరీ రక్తనాళాలు మరింత తొందరగా దెబ్బతిని గుండెపోటు రావడానికి అవకాశాలు వున్నాయి. 40 సంవత్సరాల లోపు వయస్సు వారికి గుండెపోటు రావడానికి కారణాలలో పొగతాగడం అతి ముఖ్యమైనది. పొగతాగడం పూర్తిగా మానిన వారిలో గుండెపోటు రావడం తగ్గుముఖం పడుతుందని అనేక సర్వేలలో ధ్రువపడింది. ఒకసారి గుండెపోటు వచ్చినవారు పొగతాగడాన్ని పూర్తిగా విసర్జించాలి. గుండెపోటు రాకుండా వుండాలని కోరుకునేవారు ఆచరించతగిన అతి ముఖ్యమైన నివారణ మార్గం పొగతాగడం పూర్తిగా మానివేయడమే.

కాయకష్టం చేసేవారిలో కంటే, శారీరక శ్రమలేకుండా కూర్చుని చేసే వృత్తుల వారిలో గుండెపోటు ఎక్కువగా వస్తుంది. రోజువారీ వ్యాయామం చాలా ముఖ్యం. ప్రతిరోజూ రెండు మైళ్ళు నడవడం మంచిది. సైకిల్ తొక్కడం, ఈదడం, గోల్ఫ్, బ్యాడ్మింటన్ మొదలైన ఆటలు ఇందుకు బాగా ఉపయోగిస్తాయి. చిన్న వయస్సులోని వారికి పరుగెత్తడం మంచి కసరత్తు. పరుగెత్తడం వల్ల పొట్ట కండరాలతో సహా అన్ని కండరాలకు మంచి పని కలుగుతుంది. వృద్ధులలో తోటపని శరీరానికి పనిని, మనసుకు విశ్రాంతిని కలిగిస్తుంది. గుండెపోటు వచ్చిన వారు, రక్తపోటు వున్న వారు, వృద్ధులు కఠినమైన వ్యాయామ పద్ధతులను కాకుండా, డాక్టరు సలహా ప్రకారం వారి ఆరోగ్యానికి అనువైన తేలికైన వ్యాయామాన్ని చేపట్టాలి.

యోగాసనాలు అలసటను కలిగించకుండా శరీరానికి, మనసుకు కూడా ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయి. సమర్థుడైన బోధకుని వద్ద నేర్చుకొని, అన్ని వయస్సుల వారు యోగాసనాలను వేయవచ్చు. 'శవాసనం' వంటి ఆసనాలు గుండెజబ్బు, రక్తపోటు వున్న వారికి కూడా మంచి ఉపయోగం. ఏ వ్యాయామాన్ని అయినా నెమ్మదిగా ప్రారంభించి, క్రమేణా పెంచుతూ, క్రమం తప్పకుండా కొనసాగిస్తూ వుండాలి.

రోసెన్ మేన్, ఫ్రీడ్‌మేన్ అనే వైద్య శాస్త్రజ్ఞులు 'టైప్-ఎ' మనస్తత్వం కలిగిన వ్యక్తులలో గుండెపోటు ఎక్కువగా వస్తుందని వెల్లడించారు. 'టైప్-ఎ' వ్యక్తిత్వం కలిగిన మనుషులు పరిస్థితులతోను, ఎదుటివారితోను, తమతో తామే పోటీపడి కుస్తీపట్టే మనస్తత్వం కలిగి వుంటారు. వీరు తొందరగా మాట్లాడడం, నడవడమే కాకుండా, ప్రతి పనీ నిమిషాలలో అయిపోవాలని కోరుకుంటారు. ఏ పనినైనా నెమ్మదిగా చేస్తూ పరిస్థితుల ఒత్తిడికి అంతగా లొంగని మనస్తత్వం కలిగే 'టైప్-బి' వ్యక్తులలో గుండెపోటు తక్కువ. ఆధునిక జీవితంలోని ఆదుర్దాలు, వృత్తులలో తీవ్రమైన పోటీ మనస్తత్వం, ఏదో ముంచుకుపోతున్నట్టు, ఎవరో వెంబడిస్తున్నట్టు హడావుడిగా, వేగంగా జీవితాన్ని గడపడం, మానసిక ఆందోళన, ఉద్రిక్తతను కలిగించే సంఘటనలు గుండెపోటుకు దోహదం చేస్తాయి.

జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను, కష్టాలను స్థిరచిత్తంతో, ఓర్పుతో, ప్రశాంతంగా ఎదుర్కోవడం అలవరచుకోవాలి. మన పరిమితులను దృష్టిలో ఉంచుకుని మనకు అందని లక్ష్యాలను సాధించడానికి ఆరాటపడకూడదు. అవిశ్రాంతంగా, అమిత వేగంతో పెద్ద పెద్ద ప్రణాళికలను చేపట్టే బదులు, మధ్యమధ్యలో వారాంతాలు విశ్రాంతి తీసుకుంటూ ఎక్కువ వ్యవధి తీసుకొన్నప్పటికీ తక్కువ వేగంతో కృషి చేస్తే మన వృత్తులలో ఎక్కువ ఫలితాలను సాధించవచ్చు.

మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం మొదలైన అంశాలు వంశపారంపర్యంగా వస్తాయి. కాబట్టి, కొన్ని కుటుంబాలలో గుండెపోటు ఎక్కువగా రావడంలో ఆశ్చర్యమేమీ లేదు. తల్లిదండ్రులు, దగ్గర బంధువులు 40, 50 లేక 60 సంవత్సరాల వయస్సులో గుండెపోటుతో బాధపడి వుంటే, ఆ కుటుంబ సభ్యులు పైన చెప్పిన జాగ్రత్తలను అన్నింటినీ పాటించాలి.

ఛాతీలో వచ్చే ప్రతి నొప్పి 'అంజైనా' లేదా గుండెపోటు కాకపోవచ్చు. డాక్టర్ వద్దకు వెళ్ళి ఇ.సి.జి. మొదలైన పరీక్షలు చేయించుకుంటే వ్యాధి నిర్ధారణ అవుతుంది. గుండెకు సంబంధించిన నొప్పో కాదో నిర్ణయించడానికి, ఒకసారి గుండెపోటు వచ్చి కోలుకొన్న వారికి 'ట్రెడ్‌మిల్ టెస్ట్' అనే పరీక్ష చేయిస్తారు. దీనిలో లోపం ఉంటే 'కరోనరీ యాంజియోగ్రఫీ' అనే పరీక్ష అవసరం కావచ్చు. కరోనరీ రక్తనాళాల పరిస్థితి గురించి, ఎన్ని రక్తనాళాలలో అవరోధం వున్నదీ ఈ పరీక్షలో తెలుస్తుంది.

'అజైనా' వ్యాధి మందులకు తగ్గకపోయినా, తరచుగా నొప్పి వస్తూ రోగి దైనందిన జీవితానికి ఇబ్బందిగా వున్నా, 'యాంజియోగ్రఫీ'లో కరోనరీ రక్తనాళాలలో అవరోధాలున్నట్టు నిర్ధారణ జరిగినా 'బైపాస్' శస్త్ర చికిత్స అవసరం అవుతుంది. ఒకప్పుడు విదేశాలలోనే సాధ్యమవుతుందనుకొన్న ఈ శస్త్రచికిత్సను గత కొన్ని సంవత్సరాలుగా దేశంలోని అన్ని ముఖ్య నగరాల్లోనూ విజయవంతంగా చేస్తూ మంచిఫలితాలను సాధిస్తున్నారు. ఈ 'బైపాస్' శస్త్ర చికిత్సలో తొడలో నుంచి సిరను తీసి బృహద్ధమని (అయోర్టా)కి, కరోనరీ ధమనిలో అవరోధపు దిగువ భాగానికి జత కలుపుతారు. ఈ శస్త్ర చికిత్స అనంతరం కూడా స్పెషలిస్టుతో అప్పుడప్పుడూ చెకప్‌లు, ఆహార విహారాదులలో తగిన జాగ్రత్తలు తీసుకొంటూనే ఉండాలి. ●

కమ్యూనిస్టు పాత్రికేయ దీక్ష

జీవిత చరమాంకంలో ప్రవేశించిన ఎవ్వరైనా తమ అనుభవాలను నెమరేసుకుంటారు. ఏభైఏళ్ళకు పైగా పాత్రికేయ వృత్తిలో, అందులోనూ ఒక ఉదాత్తమైన లక్ష్యం కోసం కట్టుబడ్డ కమ్యూనిస్టు పత్రికల్లో పని చేసిన బొమ్మారెడ్డిగారు తన అనుభవాలను జ్ఞాపకం చేసుకోవడం సహజమే. బొమ్మారెడ్డిగారికి జర్నలిజం ఒక కెరీర్ కాదు. అది ఒక దీక్ష.

ఎనభై ఆరేళ్ళ క్రితం కృష్ణాజిల్లా తేలప్రోలు గ్రామంలో ఒక సంపన్న రైతు కుటుంబంలో జన్మించిన బొమ్మారెడ్డి బాల్యంలోనే స్వాతంత్ర్యోద్యమం పట్ల, క్రమంగా సోషలిస్టు భావాలు, ఆ తర్వాత కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యారు. కాలేజి విద్య ముగిసే నాటికి ఆయన తండ్రిగారు ఆశపడ్డట్లు మంచి ఉద్యోగం వెదుక్కోవడానికి బదులు జీవితాంతం కమ్యూనిస్టు ఆశయాల కోసం కృషి చెయ్యాలని కంకణబద్ధులయ్యారు. 1945లో కమ్యూనిస్టు పార్టీ దినపత్రిక 'ప్రజాశక్తి'లో చేరడంతో ఆయన పాత్రికేయ జీవితం ఆరంభమయింది. 1948లో ఆ పత్రిక నిషేధించబడేంత వరకూ దానిలో కొనసాగిన బొమ్మారెడ్డి స్వగ్రామం చేరుకొని పార్టీ కార్యకలాపాలలో పాల్గొంటూనే 'ఆనందవాణి' పత్రికకు వ్యాసాలు రాస్తుండే వారు. ఆ తర్వాత పార్టీ ఆదేశం మేరకు 'జనత' పక్ష పత్రికను 'మాభూమి' నాటక రచయిత వాసిరెడ్డి భాస్కరరావుగారితో కలిసి విజయవాడ నుండి తీసుకొచ్చారు. అక్కడ ప్రభుత్వ నిర్బంధం తీవ్రం కావడంతో 'జనత' పత్రికను నిలిపి వేసి మద్రాసు వెళ్ళమని పార్టీ వారిని కోరింది. అప్పటికే పార్టీ నాయకత్వం డిక్లరేషన్ తీసుకొని సిద్ధంగా వున్న 'సందేశం' పత్రికలో బొమ్మారెడ్డిగారు చేరారు. దానికి రాంభట్ల కృష్ణమూర్తి వర్కింగ్ ఎడిటర్. ఆ పిమ్మట పార్టీ నాయకులు మద్దుకూరి చంద్రశేఖరరావు సూచన మేరకు ప్రఖ్యాత సాహితీవేత్త తాపీ ధర్మారావు నిర్వహిస్తున్న 'జనవాణి' పత్రికలో బొమ్మారెడ్డి చేరారు.

పార్టీపై నిషేధం, నిర్బంధం అమలు జరుగుతున్న కాలంలో పత్రికారంగం లాంటి బహిరంగ కార్యకలాపాల్లో పాల్గొంటున్న వారు కీలక పాత్ర వహిస్తుండేవారు. అజ్ఞాత వాసంలో వున్న పార్టీ నాయకత్వం తోను, కార్యకర్తలతోను సంబంధాలు కొనసాగిస్తూ పార్టీకి అవసరమైన పనులు చేస్తుండేవారు.



అరుదైన అర్ధశతాబ్ద కమ్యూనిస్టు జర్నలిస్టు

వి. ఆర్. బొమ్మారెడ్డి

జ్ఞాపకాలు, అనుభవాలు

వెల : రు. 50/-, **పేజీలు :** 92

ప్రచురణ : వాసిరెడ్డి సత్యనారాయణ

ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

నిరంతరం వారిపై ప్రభుత్వ గూఢచారి నిఘా కొనసాగుతుండేది. 'ఆనాటి పరిస్థితులను ఈనాడు తలుచుకుంటే అలా ఎలా ఉండకలిగామన్న సందేహం నాకు కలుగుతుంది' అని బొమ్మారెడ్డి చెప్పారు. అయితే బహిరంగంగా పని చేసే వారి ద్వారా రహస్యంగా కొనసాగుతున్న పార్టీ నాయకులను పట్టుకొని మట్టుబెట్టడమే గూఢచారుల అసలు లక్ష్యం కాబట్టే తాము బ్రతికి బట్టకట్టకలిగామని ఆయన చెప్పింది కూడా వాస్తవం.

పార్టీపై నిషేధం ఎత్తివేసిన తర్వాత మళ్ళీ 'ప్రజాశక్తి'ని ప్రచురించడానికి నిర్ణయించారు. బొమ్మారెడ్డి, ప్రముఖ రచయిత మహీధర రామమోహనరావు, టి.వి.కృష్ణగారలు 'ప్రజాశక్తి'ని వారపత్రికగా తీసుకొచ్చే వారు. 1952లో ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ప్రజాశక్తిని దినపత్రికగా మార్చాలని పార్టీ నిర్ణయించింది. భాషా ప్రయుక్త రాష్ట్రోద్యమమం ఉధృతంగా వున్న ఆనాడు పార్టీ దినపత్రికకు 'విశాలాంధ్ర' అని పేరు పెట్టారు. 1952 జూన్ 22న విశాలాంధ్ర దినపత్రిక ఆవిర్భవించింది. విశాలాంధ్రలో బొమ్మారెడ్డి బాధ్యతల రీత్యా న్యూస్ ఎడిటర్. ప్రధాన సంపాదకులుగా వున్న మద్దుకూరి చంద్రశేఖరరావు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంతో మోటూరు హనుమంతరావును పార్టీ విశాలాంధ్ర సంపాదకులుగా నియమించింది. ఎనిమిదేళ్ళ పాటు ఆయన విశాలాంధ్ర సంపాదకులుగా పనిచేశారు. పార్టీ చీలిన తరువాత బొమ్మారెడ్డి సి.పి.ఎం. అధికార పత్రిక 'జనశక్తి'లో పని చేశారు. ఉగ్రవాదుల విచ్ఛిన్నం తర్వాత పార్టీ స్థాపించిన 'ప్రజాశక్తి' వారపత్రికకు బొమ్మారెడ్డి సంపాదక బాధ్యతలు స్వీకరించారు. 1981లో దినపత్రికగా మారిన ప్రజాశక్తికి మోటూరు హనుమంతరావు సంపాదకులు కాగా బొమ్మారెడ్డి 1996లో రిలీవ్ అయ్యేంత వరకు ప్రధాన బాధ్యతలు నిర్వహించారు.

"బొమ్మారెడ్డి కాచివడ బోసిన కమ్యూనిస్టు, కమ్యూనిస్టు పత్రికల్లో జీతాలు కాదు ముఖ్యం ఉన్నత పదవులు అధిరోహించడం అంత కన్నా కాదు. పత్రిక పార్టీకి, ప్రజలకు మధ్య వారధి.... అదొక పవిత్ర బాధ్యత. అటువంటి బాధ్యతను ఇటు ఓపెన్‌గాను, అటు రహస్య కాలంలోను నిబద్ధతతో నిర్వహించడం బొమ్మారెడ్డికి ఎంత గర్వించదగిన విషయమో, ఎంత సంతృప్తి కలిగించే విషయమో అర్థం చేసుకోగలను" అని సీనియర్ పాత్రికేయులు వి.హనుమంతరావు చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

పత్రికలో పని చేయడంతో పాటు బొమ్మారెడ్డి పలు గ్రంథాలను అనువదించారు. స్వయంగా కొన్నింటిని రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ స్థాపనలోను, నిర్వహణలోను బొమ్మారెడ్డి పాలుపంచుకున్నారు. ఆయన అకుంఠిత దీక్ష ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పాత్రికేయ రంగంలో పని చేస్తున్న యువతీ యువకులకు స్ఫూర్తిదాయకం. నేడు మీడియా రంగం ఎంతో విస్తరించింది. తామెక్కడ పని చేస్తున్నా, ఉన్న పరిమితుల్లోనే ప్రజలకు ఉపయోగపడే విధంగా వ్యవహరించాలన్న ప్రేరణను ఈ పుస్తకం కలుగచేస్తుంది. ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు పత్రికలు పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రస్తుతం ఆరు ఎడిషన్లతో రాష్ట్ర వ్యాపితంగా విస్తరించిన 'ప్రజాశక్తి' పునాదులను తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. ప్రతి పాత్రికేయుడూ విధిగా చదవాల్సింది ఈ పుస్తకం. మలిముద్రణను అందించిన వాసిరెడ్డి సత్యనారాయణ అభినందనీయులు.

- విజయరావు

స్వీకారం

భారత స్వాతంత్ర్యోద్యమం - ముస్లింలు

రచన : సయ్యద్ నశీర్ అహ్మద్

వెల : రు. 10/-; **ప్రతులకు :** తక్షశిల ప్రచురణలు, డోర్ నెం. 11-450/సి1, ఎన్.సి.సి. రోడ్, మంగళగిరి, గుంటూరు జిల్లా; అజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఉండవల్లి సెంటర్, గుంటూరు జిల్లా; ప్రజాశక్తి, విశాలాంధ్ర, మైత్రి, నవోదయ దిశ, సహచర మణి బుక్‌హౌస్

సాహిత్య సమాలోచన

రచన : వై. విజయకుమార్

వెల : రు. 40/-; **ప్రతులకు :** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

జంబూద్వీప చక్రం

అనంతపురం జిల్లాలోని కొనకొండ్ల గ్రామం అతిప్రాచీన, అత్యంత ప్రముఖ జైనక్షేత్రంగా ఖ్యాతికెక్కిందని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. 13వ శతాబ్దంలో వీరశైవులు విజృంభించే వరకు అనంతపురం జిల్లాలో జైనమతం ప్రముఖంగా వున్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయి. శ్రావణ బెళగొళలో (కర్నాటక) దొరికిన శాసనం ప్రకారం భారతదేశంలో కొనకొండ్ల అత్యున్నత ప్రమాణాలు గల జైనమత కేంద్రం. జైనుల ప్రాచీన సంస్కృతికి ప్రతీకగా నిలిచిన "జంబూద్వీప చక్రం" గ్రామంలోని రససిద్ధుల గుట్టపై అందంగా చెక్కారు. పురాతన కాలంలో చెక్కిన ఈ జంబూద్వీవ చక్రాన్ని ఇటీవలి వరకు ఎవరూ గుర్తించలేకపోయారు. 1996వ సంవత్సరంలో కొనకొండ్ల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న ఆర్. వి. చక్రవర్తి తొలిసారిగా జంబూద్వీపచక్రాన్ని గుర్తించాడు. ఆ పక్కనే జరుగుతున్న క్వారీయింగ్ వల్ల రాళ్లు ఈ చక్రంపై పడితే నాశనమవుతుందని చక్రవర్తి భావించారు. వెంటనే రాష్ట్ర ఉన్నతాధికారులకు, హైకోర్టుకు టెలిగ్రాములు



జంబూద్వీపచక్రాన్ని సందర్శించిన అప్పటి గవర్నర్ సతీమణి హరిప్రియారంగరాజన్

(1996 సెప్టెంబరు) పంపారు. టెలిగ్రాములనే రిట్ పిటీషన్లుగా భావించిన హైకోర్టు క్వారీ పనులను నిలిపివేయాలని 1996 అక్టోబరులో ఆదేశాలిచ్చింది. అయినా క్వారీ యజమానులు 2000 సంవత్సరం నవంబరు దాకా క్వారీ పనులు సాగించారు.

తర్వాత జైన తీర్థక్షేత్ర కమిటీకి (బొంబాయి) మెసేజ్ పంపితే, ఆ కమిటీ జంబూద్వీపచక్రం ఉన్న ప్రదేశాన్ని సందర్శించింది. ఆ స్థలం ఇస్తే అభివృద్ధి పరుస్తామని కమిటీ చెప్పింది. దీంతో జంబూద్వీప చక్రం పేరు మరలా జనాల్లో వినిపించసాగింది. ప్రకృతి శోభితమైన కొనకొండ్ల కొండల్లో కంబనరసింహస్వామి, రససిద్ధుల గుట్టపై కరిబసప్ప గుట్టలున్నాయి. రససిద్ధుల గుట్టపై తీర్థంకరుల ఆలయాలున్నాయి. ఈ ఆలయాల వెనుకభాగంలో బండపై పద్మం మీద నిలబడిన కొండకుందాచార్యుల రూపం చెక్కబడి ఉంది. దానికి సమీపంలోనే పెద్ద బండపై జంబూద్వీపచక్రం చెక్కారు. దక్షిణ భారతదేశంలోని జైనులలో కొండకుందాచార్యులు ముఖ్యులుగా ప్రసిద్ధిగాంచారు. ఇక్కడ జైనమతానికి చెందిన ప్రధాన గురువుగా ఈయన్ని భావిస్తారు. ఈయన ఈ గ్రామంలో నివసించినట్లు రుజువులున్నాయి. ఆయన పేరు మూలంగానే ఆ గ్రామానికి 'కొనకొండ్ల' అని పేరు వచ్చినట్లు తెలుస్తోంది. కొండకుందుని కాలానికి తెలుగుగాని, కన్నడ భాషలుగాని లేవు. ఆయన రచనలన్నీ ప్రాకృతంలోనే ఉన్నాయి. తమిళులు వేదంగా భావించే 'తిరక్కురళ్' రచించింది కుందాచార్యులేనని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఈయన 85 సంవత్సరాలు జీవించి క్రీ.శ 44లో మరణించినట్లు స్థల పురాణం చెబుతోంది.

కరిబసప్ప గుట్టలో 44 ఎకరాల భూమిని జైన కమిటీకి ఇస్తే అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రం, ఆశ్రయం, విశ్వవిద్యాలయం నిర్మిస్తామని 2000 సంవత్సరం నవంబరులో బొంబాయిలోని భారత వర్షీయ దిగంబర క్షేత్ర కమిటీ చెప్పింది. 2001 ఫిబ్రవరిలో ఈ భూమిని జైనకమిటీకి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది.

గతంలో అనంతపురం జిల్లా పెనుకొండ ప్రాంతం జైనులకు నివాస స్థలంగా ప్రఖ్యాతిగాంచింది. ఇక్కడ పార్శ్వనాథగుడి వద్ద లభించిన శాసనాన్ని జైన సమయాచార్యుల్లో జినభూషణ భట్టారకుడు ప్రధానాచార్యుడుగా ఉన్నట్లు తెలుస్తోంది. జైనమత విద్యా బోధనకు దేశంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాలలో పెనుకొండ ఒకటి. మిగిలినవి ఢిల్లీ, కొల్హాపూర్, దినకంచి కేంద్రాలుగా ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర సామ్రాజ్య నిర్మాణ ప్రారంభ దశలో పెనుకొండ జైనమత ప్రధాన కేంద్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. పెనుకొండలోని అజితనాతబదరి అనే జైనగుడిలో తీర్థంకరుల కంచు విగ్రహాలున్నాయి. మడకశిర తాలూకాలో లభించిన జైనబసదులు, నిషిధులు (సమాధులు), విగ్రహాలు, శాసనాలను బట్టి ఆ ప్రాంతం కూడా జైనమతానికి పటిష్టమైన కేంద్రంగా ఉన్నట్లు తెలుస్తోంది. హేమావతి, పాతశివపురం, కొత్త శివపురం, అమరాపురం, తమ్మడేపల్లి తదితర గ్రామాల్లో జైనమత అవశేషాలున్నాయి. ఇక్కడి శాసనాలను పరిశీలిస్తే జైన దేవాలయాలకు ఆ కాలం రాజులు ఇచ్చిన దానాలు, వీరిని ప్రోత్సహించిన విధానాలు తెలుస్తాయి. ఇక్కడ సమాధులపై ఉన్న శాసనాలు జైనమత ప్రచారకులు ఏ విభాగానికి, ఏ కాలానికి చెందినవారో తెలియజేస్తాయి. ●

గురజాడ సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవి. నవ్యాంధ్ర సాహిత్యానికి ఏకైక నాయకుడు. ప్రపంచంలో ఎప్పటి ప్రామాణ్యాలకైనా నిలువగల సార్వజనీనత సాధించిన వాడు... అంటారు మహాకవి శ్రీశ్రీ. గురజాడ ఆధిక్యానికి కారణాలను వివరిస్తూ దాదాపు యాభైయేళ్ళ క్రితం ఆయన గొప్ప వ్యాసం రాశారు. ఒక సాహిత్యకారుని విశిష్టత, ఆధిక్యతను నిర్ణయించే అంశాలేమిటో అందులో తెలియజేశారు. గురజాడ వర్ధంతి సందర్భంగా ఆ వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాం.

గురజాడ ఆధిక్యానికి కారణాలు

1909వ సంవత్సరం మే 1వ తారీఖున ఉదకమండలంలోని 'ఎల్క్‌హిల్ హౌస్'లో కూర్చొని రెండో ముద్రణ కాబోతున్న తన నాటకానికి పీఠిక రాసుకుంటున్నాడొకాయన. అతని వయస్సు 45 సంవత్సరాలు. ఇంకో ఆరేళ్ళలో అతను విశాఖపట్టణంలో మరణించబోతున్నాడు. ఉన్ని గుడ్డలు కట్టుకొని శాలువా కప్పుకొని జాగ్రత్తగా శరీరాన్ని కాపాడుకొంటున్నాడు. అప్పటికే అతన్ని పీడిస్తున్న వ్యాధి అత్యంత తీవ్రరూపం ధరించింది. ఆరోగ్యం కోలుకోడానికే ఉదకమండలం వెళ్ళాడతను. స్థలం ఊటీ. సమయం 1909 మేడే. రాస్తున్నది కన్యాశుల్కానికి ద్వితీయ ముద్రణ పీఠిక. రాతగాడు గురజాడ అప్పారావు.

ఆ పీఠిక ఇంగ్లీషులో ఉన్నందువల్ల తెలుగు మాత్రమే తెలిసిన ఆంధ్రులనేకులకు అందులో వున్న అమూల్య విషయాలు అందిరాకపోతున్నాయి. నాటక రచన, సంఘ సంస్కరణ, వ్యావహారిక భాషా ప్రాశస్త్యం, రచయితలు తాము రాసిన పుస్తకాలు అచ్చువేయించుకోడానికి పడేపాట్లు, పాఠ్యపుస్తక నిర్ణేతల నిరర్థక నిరంకుశత్వాలు, విశ్వవిద్యాలయాధ్యాపకుల సాహిత్య పరాఙ్ముఖత్వం, సమకాలిక విద్వాంసుల ఛాందసాలు ఒకటేమిటి ఎన్నో సంగతులున్నాయి ఆ పీఠికలో.

'తెలుగుదేశంలో గ్రంథకర్త అయిన వాడు తన పుస్తకాలు తానే అచ్చొత్తించుకోవాలి. తానే అమ్ముకోవాలి' అని ఆనాడు మహాకవి అన్నమాట ఈనాటికీ యదార్థంగానే ఉంది. అందులోనే అతనింకోమాట అన్నాడు.

అతి క్లిష్టమైన అనేక సాంఘిక పరిస్థితుల్ని ప్రదర్శించే ఆధునిక జీవితాన్ని నాటక రచయితలెవ్వరూ కథావస్తువుగా స్వీకరించడం లేదు అని. కొద్ది మినహాయింపులతో నాటక రచయితల గతి నాటికీ నేటికీ ఒక్కలాగే ఉంది.

ఆ మరుసటి సంవత్సరం తోకచుక్క కనబడ్డయేడు. బరంపురంలో నానాజాతి సహపంక్తి భోజనం జరిగిన ఏడు. మహాకవి గురజాడ అప్పారావు మొట్టమొదటిసారి ముత్యాలసరాలు గుచ్చిన ఏడు. అప్పుడే తెలుగు కవిత్వంలో విప్లవ శకం ఆరంభమైంది.

ఈ విషయాన్నిక్కడ కొంచెం విపులీకరించదలచుకున్నాను. కందుకూరి వీరేశలింగం, తిరుపతి వెంకటేశ్వర కవులు, ఆఖరికి రాయప్రోలు సుబ్బారావు వీళ్లెవ్వరూ కారు ఆధునిక సాహిత్య విప్లవ నాయకులు. ఇప్పుడు చెప్పిన వాళ్ళంతా గురజాడ అప్పారావు కంటే గొప్పవారు కూడాను. కాని, సాహిత్య పరిణామంలో ఈ చెప్పిన నలుగురికీ - గురజాడ అప్పారావుకీ వున్న తేడా, సామాజిక వ్యవస్థలో సంస్కరణప్రియునికీ, విప్లవ నేతృత్వానికి మధ్య వున్న భేదం వంటిదే. ఆధునిక సాహిత్యంలో ఆచార్య పీఠం ఎవరిదీ అన్న ప్రశ్నకు కందుకూరి వీరేశలింగంగారిదని కొందరూ, తిరుపతి వెంకటేశ్వర కవులదని కొందరూ, రాయప్రోలు సుబ్బారావుదని మరికొందరూ జవాబిస్తారు. కొన్ని పరిమితమైన ఆవరణల్లో వీరి జవాబులన్నీ అంగీకరింపదగ్గవే. నిశ్చయంగా కందుకూరి వీరేశలింగం యుగపురుషుడే. తిరుపతి వెంకటేశ్వరులు మార్గదర్శకులే. రాయప్రోలు ఒకానొక కవితా పద్ధతికి ఒరవడి పెట్టినవాడే. అయితే గురజాడలో ఎక్కడుంది విశిష్టత? ఎందులో ఉంది ఆధిక్యం? రాయప్రోలు మీద అభిమానం కొద్దీ ఆయన భక్తులతనికాచార్యత్వం ఇచ్చినట్లు గురజాడ మీద మూఢవిశ్వాసంతో అతణ్ణి నాయకునిగా అంగీరిస్తున్నానా, లేక వ్యక్తిగతాభిరుచుల కతీతమైన విశేష ప్రామాణ్యాలు మరేవైనా వున్నాయా?

ఉన్నాయంటాను నేను. వీటిలో ముఖ్యమైనదీ మొట్టమొదట చెప్పుకోవలసినదీ ఏమిటంటే, ఏ కవికైనాసరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవియొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతి శీలీ, ప్రతిభాశాలీ అయితే ఆ గమనాన్ని అతడు మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవ పంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ

ఒకందుకు నాకు విచారం వేస్తుంది. తమిళులు తమ జాతీయకవిగా సుబ్రహ్మణ్య భారతిని అంగీకరిస్తారు. మళయాళీలకు వల్లథోల్ ఉన్నాడు. వంగీయుల మహాకవి రవీంద్రనాథ ఠాకూరు. అలాగే ఇతర ప్రాంతాలకు ఇతర కవులు. కాని తెలుగులో మాత్రం తమ జాతీయ కవి విషయమై తెలుగువారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఎవరిని గొప్పవాడంటే ఇంకెవరికి కోపం వస్తుందో అనో లేక ఎవరి గొప్ప వారిది మనం ఎవరం నిర్ణయించడానికి అనో! మళ్లీ కవి పూజలో తెలుగువారు మరే ఇతర ప్రాంతీయులకూ తీసిపోరు. బహుశా భారతదేశం అంతట్లోకి కవులను హెచ్చుగా ఆరాధించేది తెలుగుదేశమే యేమో కూడా! అయినప్పటికీ రాజకీయాలలో వలెనే సాహిత్యంలో కూడా మనకి బహునాయకత్వం తప్పలేదు.

అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను.

ఇక రెండోది మొదటి అంశం నుండే మొగ్గతొడుగుతుంది. మొదటిది టెంపోకి సంబంధించిందైతే రెండోది డైరెక్షన్‌కి చెందింది. పరిణామం ఎంత వేగంగా సాగింది అనే కాకుండా ఏ దిక్కుగా సాగింది అని కూడా ఆలోచించాలి. పురోగమనమా పశ్చాద్గమనమా అనే విషయం ఆలోచించాలి. ఇంగ్లండ్‌లో టి.ఎస్.ఇలియట్‌ని ఈనాటి మహాకవులలో ఒకడని అందరూ అంగీకరిస్తారు. మన విశ్వనాథ సత్యనారాయణగారున్నారు. ఆయనా అంతే. గ్రీకు రోమన్ కాలాల సంస్కృతి ఇలియట్‌ను ఆకర్షించినట్టే రామాయణ భారత కాలాల వైభవం విశ్వనాథవారిని ముగ్ధుల్ని చేస్తుంది. ఆ వేళకి ఈ వేళకి మానవజాతి చాలా ముందంజ వేసిందంటే ఇద్దరూ ఒప్పుకోరనుకుంటాను. ఇందుకు నిదర్శనంగా ఈ కాలపు మానసికాందోళనలను వేలెత్తి చూపిస్తారు. "ఆ పీనుగులు మనలాగే ఏడుస్తూ వుండేవారు. మనకంటే అధ్వాన్నంగా వుండేవారు" అనగలిగిన సాహసం అప్పారావుకే చెందింది. దృక్పథాలలోని తేడా ఇది. భూతకాలం మీద ఇలియట్‌కున్న అభిమానాన్ని అర్థం చేసుకుంటూనే భవిష్యత్ మీద గురుజాడకున్న విశ్వాసానికి నేనిక్కడ నివాళులెత్తుతున్నాను.

నవ్యాంధ్ర సాహిత్యానికి ఏకైక నాయకునిగా గురజాడ అప్పారావుని నేనంగీకరించడానికి మూడోకారణం భాషకి సంబంధించింది. ఇందాక నేను చెప్పిన పీఠికలో గురజాడ ఇలా అన్నాడు. "సంకెళ్ళను ప్రేమించేవాళ్ళు దాన్ని - అనగా గ్రాంథిక భాషను - ఆరాధిస్తారు గాక. నా మట్టుకు నా మాతృభాష సజీవమైన తెలుగు. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అనిపించుకున్న ఈ తెలుగులో మన సుఖాల్నీ మన దుఃఖాల్నీ వెల్లడించుకోవడానికి మనం యెవరమూ సిగ్గపడలేదు గాని కాగితం మీద పెట్టడానికి మాత్రం మనలో కొంతమంది బిడియపడుతున్నారు!"

వ్యావహారికాంధ్రం తరఫున గిడుగు రామ్మూర్తి పంతులు పండితలోకంలో సంకుల సమరాలు సాగిస్తూ ఉంటే శిల్ప ప్రపంచంలో గురజాడ అప్పారావు నూతన సృష్టికి ఉపక్రమించి నూతన విజయాలు సాధించాడు. కన్యాశుల్కం మొదటి ముద్రణ పీఠికలో ఈ విషయమై ఆయన ఇలా రాశాడు.

"గ్రామ్యం అని పొరపాటు పేరు పెట్టి పిలిచే వాడుక భాషను కావ్యరచనలలో ప్రవేశ పెడితే ఉత్తమ కావ్యాల కుండవలసిన గౌరవం దిగజారిపోతుందనే విమర్శను మనం లెక్కచెయ్యనక్కరలేదు. ఎందుచేతనంటే కావ్యప్రశస్తీ, కావ్యప్రయోజనమూ నిర్ణయించేవి పాతకాలపు వైయాకరణుల ఛాందసాలు కావు. భాషా శాస్త్రవిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన ఈ రోజులలో అంతకన్నా మంచి గీటురాళ్ళే మనకందుబాటులోకొచ్చాయి."

సినిమాలు, రేడియోలు అభివృద్ధి చెందిన ఈ రోజులలో జీవద్భాషకు గల ప్రాధాన్యం మరీ స్పష్టంగా మనకి కనిపించకపోదు. కాని ఆనాడు మొదటిసారిగా అభ్యుదయ మార్గం తీసిన వ్యక్తులు ఎన్నో ఆటంకాల నెదుర్కోవలసి వచ్చింది. కాని వాళ్ళు సువిస్పష్టంగా భవిష్యత్తును చూశారు. భాషాగమనం ఏ దిశగా పరుగెత్తుతోందో వారికి తెలుసును. యధాపూర్వ స్థితి కోసం పెనుగులాడే అభివృద్ధి నిరోధకుల అభ్యంతరాలేవీ వారిని అడ్డడం లేదు. ఈ సందర్భంలో ఒక చిన్న సంఘటన - గురజాడ అప్పారావుగారిని విజయనగర సంస్థాన శాసన పరిశోధకునిగా నియమించిన తర్వాత అప్పారావుగారు కళింగ దేశ చరిత్రను రాయడానికి కావలసిన సామాగ్రినంతా సమకూర్చుకున్నారు. ఆ గ్రంథాన్ని తాము ప్రచురిస్తామనీ, అయితే అది గ్రాంథిక భాషలోనే ఉండితీరాలనీ విజ్ఞాన చంద్రికా మండలివారు కోరగా గురజాడ అప్పారావుగారందుకొప్పుకోలేదు. అప్పుడు ఆయన మాటలివి : "నాది ప్రజల ఉద్యమం, దానిని ఎవరిని సంతోష పెట్టడానికి వదులుకోలేను." అంత విశ్వాసం ఉందన్నమాట ఆయనకి తన ఉద్యమం మీద.

'మాట్లాడినట్టే సరీగ్గా రాయడం కూడా ఎవరికి సాధ్యం? అథవా రాసినప్పటికీ అందులో ఏమి పస ఉంటుంది?" అనే వారికి కన్యాశుల్కంలోని ప్రతివాక్యమూ, ప్రతి మాటా తిరుగులేని జవాబిస్తాయి. సామాజిక వాస్తవికతను కన్యాశుల్కం ప్రతిబింబించినంత సంపూర్ణంగా మన దేశంలోని మరే ఇతర నాటకమూ ప్రతిబింబించలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. సంఘంలోని వివిధ వర్గాలకు, కులాలకు, వృత్తులకు మనః ప్రవృత్తులకు చెందిన ఎందరో వ్యక్తులు నిత్యజీవితంలో తాము ఎలాగ మాట్లాడతారో అలాగే కన్యాశుల్కంలో మాట్లాడతారు. ప్రేక్షకులను మనస్సులో పెట్టుకొని వారిని నవ్వించడానికి కృత్రిమంగా ప్రవేశ పెట్టిన సంభాషణలేవీ ఈ నాటకంలో లేవు. గిరీశం, రామప్పంతులు, పోలిశెట్టి, అసిరిగాడు ఒకరేమిటి ఎవరి గొంతుకయినా ఎక్కడైనా స్పష్టంగా పోల్చుకోవచ్చును. వాస్తవానికి దూరంగా నిలుచుని జీవితానికి మెరుగు పెట్టాలనుకుంటేనే భాషలోకి కృతకత ప్రవేశిస్తుంది. ఈ సందర్భంలో 'శిల్పం వాస్తవికతకు అతీతమైనది' అని వాదించి ప్రయోజనం లేదు. ఫోటోగ్రఫీ కళకాదని పొరపడే వాళ్ళ దృక్పథం ఇది. ఫోటోగ్రఫీని కూడా ఉత్తమ శిల్పం చేసే నిబంధనలు దానిలోనే గర్భితమై ఉన్నాయి. గురజాడ సాహిత్యంలో జీవితాన్ని ఫోటోగ్రాఫ్ మాత్రమే కాదు, యక్సురే ఫోటోగ్రాఫ్ కూడా చేశారు.

గురజాడ ఆధిక్యానికి నాలుగో కారణం అతని సార్వజనీనత. తక్కిన వాళ్ళంతా తెలుగుదేశంలో యోధానుయోధులైతే ఒక్క గురజాడ మాత్రమే ప్రపంచంలో ఎప్పటి ప్రామాణ్యాలకైనా నిలువగల సార్వజనీనతను సాధించిన వాడు. ప్రాచీన ఆంధ్ర కవులలో వేమన అటువంటి వాడు. మళ్ళీ గురజాడ అప్పారావు, తిరుపతి వెంకటేశ్వరుల ప్రతిభను తెలుగుదేశం ఆదరించినంతగా తక్కిన దేశాలు గుర్తిస్తాయని నేననుకోను. పోతన కవి తెలుగువాళ్ళ కర్థమైనంతగా, తెలుగువాళ్ళని ఉత్తేజపరిచినంతగా వెలుపలి ప్రపంచానికి కలిసివస్తాడనుకోను. నూటికి నూరుపాళ్ళు తెలుగు కవిగా ఇంట గెలుచుకొని సార్వజనీన సార్వకాలీన విశిష్టత్వంతో రచ్చ గెలువగలిగిన వాడు వేమన్న ఒక్కడే వెనుకటి కాలంలో తెలుగు కవి. అలాగే ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగుదేశపు సరిహద్దుల కవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరఫున ప్రతినిధిగా నిలుచోగలిగిన వాడు గురజాడ అప్పారావు ఒక్కడే. కవిగా మాత్రమే కాదు. కథా రచయితగా గురజాడ ధ్రువతార. అతను రాకముందు ఉన్న కవిత్వానికీ అతను రాసిన తర్వాత వచ్చిన కవిత్వానికీ పోలికే లేదు. అతనికి పూర్వం వున్న నాటకరంగానికీ అతని తర్వాత నాటకరంగానికీ మశకహస్త్యంతరం ఉంది. కవిగా నాటకకర్తగా గురజాడ ప్రతిభను దేశమంతా గుర్తించింది గాని కథా రచయితగా అతనికున్న ఉన్నతోన్నత స్థానం చాలా మందికి తెలియదనుకుంటాను. "దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్లారా మీ పేరేమిటి" అనే ఒక్క కథానిక చాలును - కథకులలో గురజాడకి అగ్రేసరత్వం స్థాపించడానికి.

ఒకందుకు నాకు విచారం వేస్తుంది. తమిళులు తమ జాతీయకవిగా సుబ్రహ్మణ్య భారతిని అంగీకరిస్తారు. మళయాళీలకు వల్లథోల్ ఉన్నాడు. వంగీయుల మహాకవి రవీంద్రనాథ ఠాకూరు. అలాగే ఇతర ప్రాంతాలకు ఇతర కవులు. కాని తెలుగులో మాత్రం తమ జాతీయ కవి విషయమై తెలుగు వారు ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. ఎవరిని గొప్పవాడంటే ఇంకెవరికి కోపం వస్తుందో అనో లేక ఎవరి గొప్ప వారిది మనం ఎవరం నిర్ణయించడానికి అనో! మళ్లీ కవి పూజలో తెలుగు వారు మరే ఇతర ప్రాంతీయులకూ తీసిపోరు. బహుశా భారతదేశం అంతట్లోకి కవులను హెచ్చుగా ఆరాధించేది తెలుగుదేశమే యేమో కూడా! అయినప్పటికీ రాజకీయాలలో వలెనే సాహిత్యంలో కూడా మనకి బహునాయకత్వం తప్పలేదు. ●

ADVOCATE

న్యాయసలహాలు

మెడికల్ ఇన్‌వాలిడేషన్ వర్తించదా?

నేను మెడికల్ ఇన్‌వాలిడేషన్ మీద రిటైర్ అయ్యాను. నాకు ఒక కుమారుడు ఉన్నాడు. పెళ్ళి అయ్యిందనే పేరుతో అతనికి ఉద్యోగం ఇవ్వలేదు. నా సర్వీసు ఐదు సంవత్సరాలు పోయింది. ఉద్యోగమూ పోయింది. దీనిపై జిల్లా అధికారిని సంప్రదించగా ప్రభుత్వానికి రాస్తాం, ప్రభుత్వం నుండి పర్మిషన్ వస్తే చూద్దాం అని తెలిపారు. ఇంకా ప్రభుత్వానికి తెలియజేయలేదు. తగు న్యాయ సలహా ఇవ్వండి. నేను వికలాంగుణ్ణి.

- జి.సింహాచలం, కొక్కిరాపల్లి, విశాఖపట్టణం.

మీ ప్రశ్నలో అన్ని విషయాలు స్పష్టంగా పేర్కొనలేదు. మీరు ఎప్పుడు రిటైర్ అయ్యారో, మెడికల్ ఇనవాలిడేషన్ ఎప్పుడు తీసుకున్నారో లేఖలో తెలియచేయలేదు. ఈ రెండు అంశాలే ఈ ప్రశ్నకు కీలకమైనవి. మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 12.10.2001తేదీన ఒక కీలకతీర్పు వెలువరించింది. దీని ప్రకారం మెడికల్ ఇన్‌వాలిడేషన్ ఆధారంగా రిటైరైన వారి స్థానంలో వారసులకు ఉద్యోగం ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించింది. హైకోర్టు తీర్పుననుసరించి 27.4.02 తేదీన జివో ఎంఎస్ నం. 202, 203 ద్వారా మెడికల్ ఇనవాలిడేషన్‌పై ఆధారపడి ఉద్యోగాలిచ్చే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం స్వస్తి పలికింది. అయితే అనేక సర్వీస్ అసోసియేషన్లు, ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తి మేరకు 17.2.03న రాష్ట్ర ప్రభుత్వం జివో. ఎంఎస్. నం. 44ను విడుదల చేసింది. ఈ జివో ప్రకారం ఏ ఉద్యోగి అయినా మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద 27.4.02 నాటికి రిటైర్ అయ్యింటే సదరు ఉద్యోగిపై ఆధారపడిన వారికి ప్రభుత్వంలో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉద్యోగం ఇవ్వడానికి అవకాశం కల్పించారు.

జిల్లా కార్యాలయం నిర్లక్ష్యంతో నష్టపోయాను

సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలుర వసతి గృహంలో కామాటిగా పని చేస్తున్న మా అమ్మగారిని అనారోగ్య కారణాల వలన మెడికల్ ఇన్‌వాలిడేషన్ స్కీం కింద తొలగించి మా కుటుంబ జీవనోపాధి కోసం నన్ను నియమించవలసిందిగా **5-11-2001** తేదీన దరఖాస్తు చేశాం. మా అమ్మగారి దరఖాస్తును సంబంధిత వార్డెన్ తేది **6-11-2001**న సాంఘిక సంక్షేమ శాఖ వరంగల్ జిల్లా ఉపసంచాలకులకు సిఫారసు చేశారు.

ఈమేరకు **26-2-2002** నాడు మా అమ్మగారిని వైద్య పరీక్షల నిమిత్తం వరంగల్ రావలసిందిగా ఒక లెటర్ పంపారు. వైద్యపరీక్షల నివేదిక, మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల నివేదిక తెప్పించుకున్న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారులు తమ సిఫార్సులను వరంగల్ జిల్లా కలెక్టర్ గారికి పంపించలేదు. మా అమ్మగారితో పాటు వైద్యపరీక్షలు చేయించుకున్న ఇతర డిపార్ట్‌మెంట్ వారి పిల్లలకు ఉద్యోగాలు వచ్చాయి. కాని సాంఘికసంక్షేమ శాఖ కార్యాలయంలోని ఒక క్లర్క్, సూపరింటెండెంట్‌లు అశ్రద్ధ చేసి మా అమ్మగారి ప్రతిపాదనలు తొక్కి పెట్టారు. ఈలోగా మెడికల్ ఇన్‌వాలిడేషన్ పథకాన్ని ప్రభుత్వం రద్దు పరిచింది. దీని వలన నాకు ఉద్యోగం దొరికే అవకాశం పోయింది.

మా అమ్మగారి ప్రతిపాదనలు ప్రభుత్వం మెడికల్ ఇన్‌వాలిడేషన్ పథకం రద్దు పరచడానికంటే ముందువి గనుక మా సమస్యకు తగు పరిష్కారం చూపించగలరని మనవి చేసుకుంటున్నాను.

దాసరి వెంకటేశ్వర్లు, మహబూబాబాద్,
వరంగల్

మొదటి ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలో మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వడం జరిగింది. మీరు రాసిన లేఖలో మీ అమ్మగారు మెడికల్ ఇన్‌వాలిడేషన్ కింద రిటైర్ అయ్యారా లేక ఇంకా సర్వీస్‌లో కొనసాగుతున్నారా అన్నది రాయలేదు. మొదటి ప్రశ్నకు ఇచ్చిన సమాధానంలోని వివరాల ప్రకారం మీ అమ్మగారు ఇంకా సర్వీస్‌లో కొనసాగుతున్నట్లయితే ఆమె మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రాతిపదికపై రిటైర్ అయ్యేందుకు అవకాశం లేదు. కనుక మీకు మీరు కోరుకున్న విధంగా ఉద్యోగం వచ్చే అవకాశం లేదు.

- ఎ.సత్యప్రసాద్,
హైకోర్టు న్యాయవాది

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1,
అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

రుచి

వెన్న చక్రాలు

కావలసిన వస్తువులు:

బియ్యం పిండి	: ఒక కిలో
వెన్న	: 200 గ్రాములు
వాము	: 50 గ్రాములు
ఉప్పు	: తగినంత
కారం	: తగినంత

తయారు చేసే విధానం: ముందుగా బియ్యం పిండిని జల్లించుకోవాలి. అందులో వెన్న వేసి బాగా కలపాలి. తరువాత వాము, ఉప్పు, కారం వేసి కలపాలి. ఇప్పుడు తగినన్ని నీటితో చక్రాల పిండిని కలుపుకోవాలి. బాండీలో నూనె పోసి బాగా వేడెక్కిన తరువాత చక్రాలు వత్తుకోవాలి. ఈ చక్రాలలోనే వెన్నకు బదులు 200 గ్రాముల డాల్డా లేదా పావు కిలో పెరుగు కలుపుకొని కూడా చేసుకోవచ్చు. ఇవి పత్యానికి కూడా పనికి వస్తాయి. పిల్లలకు కూడా ఎన్ని తిన్నా తేడా చేయదు.

పచ్చి మామిడి, కొబ్బరి పచ్చడి

కావలసిన వస్తువులు:

పచ్చి కొబ్బరి చిప్ప	: ఒకటి (తాజాగా ఉండాలి)
పుల్ల మామిడి	: ఒకటి
పచ్చి మిర్చి	: 10 నుంచి 15
జీలకర్ర	: ఒక స్పూను
కొత్తిమీర	: ఒక కట్ట
ఉప్పు	: తగినంత

తయారు చేసే విధానం: కొబ్బరి తురిమి ఉంచుకోవాలి. మామిడి కాయను కూడా తురిమి లేదా గ్రైండ్ చేసి ఉంచాలి. ఇప్పుడు పచ్చి మిరపకాయలు, ఉప్పు, జీలకర్ర కలిపి మెత్తగా నూరాలి. దీనికి మామిడి, కొబ్బరి కోరు కలుపుకోవాలి. దీన్ని కొద్దిగా నూనెతో పోపు పెట్టుకోవాలి. కొత్తిమీర సన్నగా తరిగి కలుపుకోవాలి.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది

రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన రైతువాణి

మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ,
క్యాలెండర్ ఉచితంగా
పొందండి.

వ్యవసాయరంగ
సంక్షోభానికి, రైతు నష్టాలకు
కారణాలను విశ్లేషించి
పరిష్కారాన్ని చూపేది
మన రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక